ప్రపంచ సాహిత్యం-40

పిల్లనగ్రోవి పిలుపు

THE CALL OF FLUTE

(THE ELIZABETHAN POETRY)

డాక్టర్ లంకా శివరామప్రసాద్

ప్రపంచ సాహిత్యం-40

పిల్లనగ్రోవి పిలుపు

THE CALL OF FLUTE

(The Elizabethan Poetry)

డాక్టర్ లంకా శివరామప్రసాద్

పిల్లనగ్రోవి పిలుపు
(The Elizabethan Poetry)

Translated by

Dr. Lanka Siva Rama Prasad

July 2017

All rights reserved

Copyright @ 2017
by **Dr. Lanka Siva Rama Prasad**
Head of the Department
Cardiothoracic & Vascular Surgery
Prathima Institute of Medical Sciences
Nagunur Road, Karimnagar - 505 417, Telangana.

Published by:

Dr. Lanka Siva Rama Prasad
Srijana Lokam / Writer's Corner
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 8897849442
Email: lankasrprasad@gmail.com

Distributed by-
All leading book centers
Visalandhra Publishing House
Navodaya Publishing House

E-book: www.kinige.com

Price : ₹ **200 $ 4**

Cover Design & Post Script : **Prakash Pula**

Printed at :

Vasavi Printers
J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

This book is presented to...

<u>ఈ రచనకు ముఖ్య ఆధార గ్రంథాలు</u>

The Golden Treasury of the Best Songs and Lyrical Poems in the English Language (F.T. Palgrave) (Rupa Classics)

ప్రస్తావన

ఈ అపురూప ప్రేమగీతాలు మొత్తం అరవై (60)లో విలియం షేక్స్‌పియర్ (33); డబ్ల్యు. డ్రమ్మండ్ (7), మిగతావి ఇరవై (20) ప్రఖ్యాత కవులు రచించినారు. "పిల్లనగ్రోవి పిలుపు"గా వెలువడ్తున్న ఈ కవితా సంకలనంలో ప్రతి కవితా దానికదే సాటి. అరవై ఒకటి – ఎడ్మండ్ స్పెన్సర్ వ్రాసిన Prothalamion – పెండ్లిపాట చివరన ఇవ్వబడినది.

ప్రేమలోని మాధుర్యాన్ని, విషాద, విరహాల్ని, దైవప్రేమను, మృత్యువును, నిద్రను, ఇతర భావనలను తెలిపే ఈ అద్భుత కవితలు ఆయా కవుల శైలిని, పదవిన్యాసాల్ని, సంగీతపు హొయల్లను పాఠకుల కనులముందుంచి, మనసును ఆకట్టుకుని చెరగని ముద్ర వేస్తాయి.

షేక్స్‌పియర్, డ్రమ్మండ్, వ్యాట్‌ల పధ్నాలుగు పంక్తుల సానెట్లు వారి రచనా వైభవాన్ని, అత్యున్నత కవిత్వ ప్రమాణాలను తెలియజేస్తాయి.

సృజనలోకం ప్రచురించిన అనేక అనువాద కవితా సంకలనాల్ని విశేషంగా ఆదరించిన తెలుగు సాహితీ లోకం ఈ పుస్తకాన్ని కూడా అక్కున చేర్చుకుంటుందని మనసారా ఆశిస్తూ...

– డాక్టర్ లంకా శివరామప్రసాద్

విషయసూచిక

1. వసంతం (Spring) .... T. Nash 8
2. ప్రేమకు పిలుపు (Summons to Love) .... W. Drummond 9
3. కాలము – ప్రేమ (Time and Love) .... Shakespeare 11
4. ప్రేమ (Love) .... Shakespeare 12
5. గొర్రెల కాపరి ప్రేమ (The Passionate Shepherd to his Love) C. Marlowe 13
6. సామూహిక గానం (A Madrigal) .... Shakespeare 14
7. శీతాకాలం (Winter) .... Shakespeare 15
8. ప్రేయసీ ప్రియులు (A Lover and His Lass) ...... Shakespeare 16
9. లేకపోవడంలో ఉండడం (Present in Absence) .. Anon 17
10. లేకపోవడం (Absence) .... Shakespeare 18
11. నీవు లేవు (You are absent) .... Shakespeare 19
12. ఓదార్పు (A Consolation) .... Shakespeare 20
13. మార్పు లేనిది (The Unchangeable) .... Shakespeare 21
14. నీ సౌందర్యం (Thy Beauty) .... Shakespeare 22
15. దయాఫెనియా (Diaphenia) .... H. Constable 23
16. రోజాలిండే (Rosalynde) .... T. Lodge 24
17. కాలిన్ (Colin) .... The Shepherd Tony ... 26
18. ఆమెకు ప్రేమతో (To her with love) .... Shakespeare 27
19. అతడి ప్రేయసికి (To his love) .... Shakespeare 28
20. ప్రేమ – అసత్య ప్రమాణాలు (Love's Perjuries) Shakespeare 29
21. వినతి (A Supplication) .... Sir T. Wyatt 30
22. అరుణ దేవతకు (To Aurora) .... W. Alexander 31
23. నిజమైన ప్రేమ (True Love) .... Shakespeare 32
24. ఒక సరళగీతం (A Ditty) .... Shakespeare 33
25. ప్రేమ సర్వవ్యాపకత్వం (Love's Omnipresence) J. Sylvester 34

26. ఈరోజు నీది (Carpe diem - Sieze the Day) .. Shakespeare 35
27. శీతాకాలం (Winter) .... Shakespeare 36
28. ఇది నీవు గ్రహిస్తే (This thou perceiv'st) .... Shakespeare 37
29. స్మృతి (Remembrance) .... Shakespeare 38
30. పరిభ్రమణాలు (Revolutions) .... Shakespeare 39
31. వీడ్కోలు (Fare-well) .... Shakespeare 40
32. ఉద్వేగం లేని జీవితం (The life without passion) Shakespeare 41
33. ప్రేమికుడి విన్నపం (The Lover's Appeal) .... Sir T. Wyatt 42
34. నైటింగేల్ (The Nightingale) .... R. Barnfield 43
35. నిద్ర (Sleep) .... S. Daniel 45
36. ప్రేమ వీడ్కోలు (Love's Farewell) .... M. Drayton 46
37. అతడి వీణకు (To his lute) .... W. Drummond 47
38. గుడ్డి ప్రేమ (Blind Love) .... Shakespeare 48
39. ఆ గొర్రెలకాపరి అవిశ్వాసురాలు (The Unfaithful Shepherdess) Anon 49
40. సన్యాసం (A Renunciation) .... E. Vere 51
41. ఆకుపచ్చని పొదరిల్లు (The Holly) .... Shakespeare 52
42. బృందగీతం-1 (Madrigal) .... Shakespeare 53
43. బృందగీతం-2 (Madrigal) .... W. Drummond 53
44. దుఃఖగీతం (Dirge of Love) .... Shakespeare 54
45. కలవాల్సిందే ధూళిలో (Come to Dust) .... Shakespeare 55
46. సముద్రపు విషాదగీతం (A Sea Dirge) .... Shakespeare 56
47. నేల విషాదగీతం (A Land Dirge) .... J. Webster 56
48. శవపరీక్ష (Post Mortem) .... Shakespeare 57
49. మృత్యు విజయం (The Triumph of Death) ..... Shakespeare 58
50. బృందగానం (Madrigal) .... Shakespeare 59
51. రతీ మన్మధులు (Cupid and Campaspe) .... J. Lyly 60
52. శుభోదయం (Good Morning) .... T. Heywood 61

53. ఆనంద హృదయం (The Happy Heart) .... T. Drekkar 62
54. జీవితం ((Life) .... W. Drummond 63
55. ఆత్మ – దేహం (Soul and Body) .... Shakespeare 64
56. జీవితం (Life) .... Lord Bacon 65
57. ప్రకృతి పాఠాలు (The Lessons of Nature) ...... W. Drummond 67
58. విధి వ్రాత (Providence) .... W. Drummond 68
59. ప్రపంచపు దారి (The World's Way) .... Shakespeare 69
60. సెయింట్ జాన్ బాప్టిస్టు (Saint John Baptist) ... W. Drummond 70
61. ప్రొథలామియాన్–పెండ్లిపాట (Prothalamion) ... Edmund Spenser 71

1. వసంతం

(Spring)

వసంతమే, మధుర వసంతమే, ఋతువులలో దానిది రాజరికమే
ఎటు చూసినా విరిసిన పూల దరహాసం, కన్యల వలయ నృత్య ప్రభాసం
చలికాలమింకా మనోజ్ఞమే, చక్కని పక్షుల గాన విశేషమే!
కోయిల, జుగ్ జుగ్, ప్యువి, టు విట్టావూ సంగీతమే!

కొత్త కొబ్బరాకులు పైకప్పుగా కళకళలాడెను పల్లెటూరి గృహాలు
కోడెదూడలు గంతులేసెను, గొర్రెపిల్లలు గొంతు కలిపెను
పక్షులన్నీ పరవశంగా పాడెను వీనుల విందుగాను,
కోయిల, జుగ్ జుగ్, ప్యువి, టు విట్టావూ సంగీతమే!

పొలాల పైరుగాలి తియ్యందనాలు, పాదాలను ముద్దాడే చేమంతి వనాలు
ప్రేమికుల సరస సల్లాపాలు, పెదనాపసానుల ఎండ కాగడాలు
ప్రతి వీధిలోనూ మధురనాదాల పులకరించును శ్రవణేంద్రియాలు
కోయిల, జుగ్ జుగ్, ప్యువి, టు విట్టావూ సంగీతమే!

వసంతమే, మధుర వసంతమే!

- టి. నాష్
(T. Nash)

2. ప్రేమకు పిలుపు

(Summons to Love)

ఉదయభానుడా, మేలుకో!
నీలి, తెలుపు, ఎరుపు రంగులతో చిత్రించుము నింగిని.
టిథొని శయ్య నుంచి మేల్కొల్పుము మెమ్నాన్ మాతను
ఆమె నీ రథంపై గులాబీలు విరజిమ్మనీ
నైటింగేల్ పక్షులు పాడనీ స్వాగత గీతాలను
ఎల్లెడలా విరిసిన వసంత శోభలే ఈ శుభ సమయాన!
జీవము నిమ్ము ఈ చేవ చచ్చిన ప్రపంచానికి
నీ స్వర్ణ శిరోజాలను పరచుము దేదీప్యమానంగా
ఇంతకు ముందెన్నడూ విస్తరించనన్ని పాయలుగా
చక్రవర్తుల రాజసం చక్కగా చిప్పిల్లగా
ముత్యాల కిరీటము నీ శిరసున మురిసి మురిసి మెరిసెనులే!
అనాకారి రాత్రిని పారద్రోలె నా కిరీటము.
నీ ప్రదీప్త కాంతిని మరింత ప్రకాశింపజేసెను.
ఇది ఆ సంతోష ప్రభాత సమయము
చీకటి ముసిరిన నా జీవితాన ఇది
ఎన్నాళ్లుగానో ఎదురు చూసిన వెలుగు దినము
(క్రూరులైన నక్షత్రాలు, విధి దేవతలు
కోరుకున్నవా నా పతనాన్ని, వంచించెనా నన్నూ నా ఆశలను?!
స్వచ్ఛమైన తెల్లటి ఈ ఉదయం
శాశ్వతమైన వజ్రముతో గుర్తింపబడునులే!
ఈ ప్రభాతము తెచ్చును ఈ వనంలోకి
నా ప్రియతమురాలిని, ఫలించును నా ప్రేమలే!

మహా చక్కని మహరాజు, మన రక్షకుడతడు
అద్భుత కిరణాలను ప్రసరింపజేయును
నీవు నీ అందమైన నయనాలతో చూసెదవు
పినియూస్ నదీ ప్రవాహాల సొబగులను వీక్షించి
అచ్చెరవొందిన వారిని మించు అద్భుత అనుభూతులను!
ఇప్పుడు, అనేక వర్ణాల పూలతో అలంకరించుకొనుము
ఈ మలయమారుత సవ్వడులలో వినిపించునులే,
ఏంఫియాన్ వీణా నాదాలను మించు సంగీతపు స్వరాలు!
అవి నీ వీనులకు తాకగా,
నీ కోపము ఉపశమించును గాక
పడమటి గాలి జెఫిర్ నిశ్వాసాలతో
ఆమె శిరోజాలటు ఇటు ఊగునులే!
గాలులన్నీ నిశ్శబ్దమై నిలువ
ఫీబస్ ప్రభాత సూర్యుడు తన సింహాసనాన ఠీవిగా కూర్చోగా
నింగీ, నేలా, గాలీ, జలధీ అరుణ రాగరంజితమై
తళుక్కుమనే తారలన్నీ అదృశ్యమైన సమయాన
తాగుబోతులా రాత్రి తూలుతూ నిష్క్రమించగా
కొండల కావల, సూర్యుడు తన జ్వాలా చక్రాల ప్రకాశించగా
మైదానాలలో వివిధ వర్ణ పుష్పాలు వికసించి విరియగా
నీలాకాశాన మేఘమాలికలు స్వర్ణజరీ అంచు వస్త్రాల శోభిల్లగా
ఇది అపురూప ఆనంద లోగిలి
ఏమీ కొరతలేదు, ఒక్క ఆమె తప్ప!
అయ్యో! ఏదీ ఆమె ఇంకా రాలేదు !
ఏదీ, ఆమె ఇంకా ఇటకు రాలేదు!

– డబ్ల్యు. డ్రమ్మండ్
(W. Drummond of Hawthornden)

3. కాలము - ప్రేమ

(Time and Love)

నేనెప్పుడైతే, కాలపు వినాశకర హస్తంచే
విరూపం చేయబడి, గత కాలపు భోగభాగ్యాల గర్వపు విలువల్తో
పాతిపెట్టబడిన యుగపు వదనాన్ని చూసానో,
నేనెప్పుడైతే, ఎత్తైన గొప్ప కోట బురుజులు ధ్వంసమై
మానవ ఆగ్రహానికి ఉన్నత కుటుంబీకులు
శాశ్వత బానిసలుగా మారడం చూసానో,
నేనెప్పుడైతే, ఆకలిగొన్న సముద్రం
తీరాన ఉన్న సామ్రాజ్యాలపై విరుచుకుపడి
సర్వనాశనం చేయడం గమనించానో,
నేనెప్పుడైతే, బలమైన నేల జలాశయం
కాగా, నిలువ ఎక్కువై నష్టం,
నష్టం ఎక్కువై నీరు ఉప్పొంగడం వీక్షించానో,
నేనెప్పుడైతే, పరస్పర స్థితి మార్పిడులతోనో
లేదా, అంతఃకలహాలతోనో రాజ్యం
నాశనం కావడం అర్థం చేసుకున్నానో,
శిథిలాలు నాకు నేర్పాయి పునఃశ్చరణం
చేయడం, - కాలం ఖచ్చితంగా వచ్చి
నా ప్రేమను తీసుకుపోతుందనీనూ-
ఈ ఆలోచనే మరణం లాంటిది, అది
ఎన్నుకోలేదు, కాని దుఃఖిస్తుంది
పోగొట్టుకుంటానేమోనని భయపడి.

- విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

4. ప్రేమ

(Love)

మట్టి కాదు, రాయి కాదు, అవధులు లేని జలధి కాదు
ఇత్తడి లోహపు ఆయుధాలు వచ్చినప్పటి నుంచి
విషాదపు మరణాలతో అధికారం ఊయలలూగుతున్నది.
ఇటువంటి ఆగ్రహపు మంటలలో సౌందర్యపు వేడుకోలును
వినేవారెవరు? దాని క్రియ అంతా ఒక
పుష్పాన్నికున్నంత బలమే కదా?
వేసవి కాలపు మకరంద సుగంధం, చితకగొట్టే
ఎండల వేడి చుట్టుముట్టినప్పుడు
ఏమాత్రం తట్టుకోగలదు?
కఠిన శిలలున్న పర్వతాలేం పెద్దవి కావు,
ఉక్కు తలుపులేమంత దృఢమైనవీ కావు
కాలం వాటిని బలహీనపరచడం లేదా?
ఓ భీతిగొలిపే ధ్యానమా! ఎక్కడ,
కాలపు ప్రశస్త మణి ఏ మందసంలో
కనబడకుండా దాగుందో చెప్పగలవా?
లేక, ఏ దృఢ హస్తం తన వేగవంతమైన
పాదాలను వెనకడుగు వేయించగలదో,
లేక, సౌందర్య విధ్వంసాన్ని ఎవరాపగలరో?
ఓహ్! ఎవరూ లేరు, ఈ అద్భుతానికి శక్తి ఉంటే తప్ప,
ఈ నల్లటి సిరాలో నా ప్రేమ మాత్రం
ఇంకా వెలుగుతూనే ఉన్నది ప్రకాశవంతంగా.

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

5. గొర్రెల కాపరి ప్రేమ

(The Passionate Shepherd to his love)

రా, నాతో నివసించు, నా ప్రియురాలివికా!
మనం అనుభవిద్దాం అన్ని ఆనందాలను,
ఆ కొండలూ, లోయలు, వాగులూ, మైదానాలు,
గరుకు పర్వతాలు ప్రసాదించే ఫలపుష్పాలు;

అక్కడి గుట్టలపై మనం కూర్చుందాం,
కాపరులు గొర్రెలను మేపడం చూద్దాం,
లోతులేని నదులు, వాటి పరవళ్లను,
మధుర స్వరాల పక్షుల బృందగానాన్ని విందాం!

గులాబీల శయ్య నేర్పరుస్తాను నేనక్కడ,
సుగంధాలు వర్షించే వేల పూలగుత్తుల్ని,
పూలటోపీ, మిర్టిల్ ఆకుల జరీ ఉన్న,
చక్కని కోటు నీకిస్తా కానుకగాను!

మన్నిక గల ఉన్నితో చేసిన గౌను
అందమైన గొర్రెల నుంచి తెచ్చిన దౌను.
చలికి తట్టుకునేందుకు చక్కని స్లిప్పర్లు
వాటికి స్వచ్ఛమైన బంగారపు తాళ్లు!

గడ్డితో చేసిన పటకాకు 'ఐవి'మొగ్గలు
పగడాల పట్టకారు, ఏంబర్ పసుపు పుడకలు
ఈ సంతోషాలు నిన్ను కదిలిస్తే
రా, నాతో నివసించు, నా ప్రియురాలివికా!

మాంసాహారానికి వెండి పళ్లేలు,
దేవతలు ఆరగించే పంచభక్ష్యాలు,
దంతపు బల్లపై చక్కటి అమరికలు,
నీకోసం, నాకోసం ప్రతిరోజూ వేడుకలు;

మా సహాయకులు ఆడతారు పాడతారు,
ప్రతిరోజూ మే-ఉదయగీతాన్ని గానం చేస్తారు,
ఈ ఆనందాలు నీ మనసును కదిలిస్తే,
రా, నాతో నివసించు, నా ప్రియురాలివి కా!

– సి. మార్లొవి
C. Marlowe

6. సామూహిక గానం

(A Madrigal)

వృద్ధాప్యం, యవ్వనం కలిసి ఉండలేవు
యవ్వనమంతా సందడి, వయసుమీరడం అలజడి
వేసవి ఉదయం యవ్వనం, శీతలరాత్రులు ముసలితనం.
యవ్వనమంటే ఎండలవేడి, వృద్ధాప్యం చలిపులి దాడి
ఆటపాటలు యవ్వన వికాసం, దమ్మూ దగ్గూ వృద్ధాప్యపు ఆయాసం
యవ్వనం ఎగిరెగిరి పడ్తుంది, వృద్ధాప్యం కుంటుతుంది.
ధైర్యం, తాపం యవ్వన లక్షణం, బలహీనం, శీతలం వయసు మీరడం
యవ్వనం అదుపు చేయనిది, వృద్ధాప్యం ప్రశాంతమైనది.
వృద్ధాప్యమా నిన్ను తిరస్కరిస్తాను, యవ్వనమా నిన్ను ప్రేమిస్తాను.
ఓ, నా ప్రియతమా, నా ప్రేమది యవ్వన దశ
    వృద్ధాప్యమా, చూడకు నా దిశ
ఓ, తీయని పలుకుల గొర్రెల కాపరీ, వెళ్లిపో త్వరగా!
    నేననుకుంటున్నా, నీవిప్పటికే చాలాసేపున్నావని ఆశగా!

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

7. శీతాకాలం

(Winter)

గ్రీన్‌వుడ్ చెట్టు నీడన
నా పక్కనే పరుండి అతడు
తన ఆనందపు మాటలను
కోయిల గొంతులో పలికిస్తాడు–

రా ఇటు, రా ఇటు, రా ఇటు!
అక్కడ చూస్తాడతడు
శత్రువు ఎవరూ లేడు
ఒక్క శీతాకాలమూ, కష్టమైన వాతావరణం మినహా!

ఎవరు గాఢమైన కోరికలను త్యజించి
సూర్యునిలో జీవించడాన్ని ప్రేమిస్తారు?
అతడు తినే దానిని కోరుకుంటూ
అతడు పొందిన దానితో సంతృప్తి పడతారు!

రా ఇటు, రా ఇటు, రా ఇటు!
అక్కడ చూస్తాడతడు
శత్రువు ఎవరూ లేరు
ఒక్క శీతాకాలమూ, కష్టమైన వాతావరణం మినహా!

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

8. ప్రేయసీ ప్రియులు

(A Lover and His Lass)

ప్రేమికుడు, అతడి ప్రియురాలు,
హే హో, హే నో నీ నో, ఓహో!
మొక్కజొన్న పొలాల్లో శృంగార విహారం,
వసంత మొక్కటే ఉంగరాల కాలం!

పక్షులు పాడుతున్నాయి డింగ్ ఎ డింగ్ డింగ్,
ప్రేమికుల కిష్టమీ వసంతపు పొంగు,
సజ్జల పొలాల మధ్య,
చక్కని ప్రేమికుల సయోధ్య!

వేకువ ఉదయాన మొదలైన గానం,
వారికీ జీవితం విరిసిన సుమ సమానం,
అందుకే ఆనందించు అందిన కాలాన్ని,
హే హో, హే నో నీ నో, ఓహో!

యవ్వనమంటేనే ప్రేమకు కిరీటం
వసంతమొక్కటే ఉంగరాల కాలం
పక్షులు పాడుతున్నాయి డింగ్ ఎ డింగ్ డింగ్
ప్రేమికుల కిష్టమీ వసంతపు పొంగు, హంగు.

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

9. లేకపోవడంలో ఉండడం

(Present in Absence)

లేకపోవడమా, నా అభ్యంతరాన్ని విను
నీ బలానికి దూరానికి, పొడుగుకు
నీ కిష్టమైన మార్పులు చేర్పులు చేసుకో
నిజమైన సత్తా ఉన్న హృదయాలను
లేకపోవడమే కలుపుతుంది
కాలం సమస్యలను పరిష్కరిస్తుంది.

అటువంటి గుణమున్న ప్రియురాలిని
ప్రేమించినవాడు త్వరలోనే గమనిస్తాడు
ఆప్యాయతా భూతలాన్ని
కాల, స్థల, మృత్యువుల కతీతంగా
చలించని హృదయాల్ని; లేకపోవడమే
ఉండడమని; కాలం ఆలస్యం చేస్తుందని.

అలా లేకపోవడమే మంచిది, లాభదాయకం
నేను దానిని పట్టుకోగలుగుతాను,
ఎవరూ ఆమెను చూడలేని చోట
నా మెదడులో ఓ మూల గదిలో,
అప్పుడామెను కౌగిలించుకుని ముద్దాడుతాను
ఆనందిస్తాను, విరహంతో దుఃఖిస్తాను.

– ఏనన్
(Anon)

10. లేకపోవడం

(Absence)

నీ సేవకుడిని కదా, నేనేం చేయగలను, కోరికల
ఘడియల్లో అడుగులకు మడుగులొత్తడం తప్ప.
నీవు కోరేంత వరకూ, నాకంటూ ప్రశస్త సమయం,
చేయాల్సిన పనులేమీ, లేవు కదా!

అంత్య ఘడియలు లేని ప్రపంచాన్ని నిందించ సాహసించ
లేను, నా సామ్రాజ్యంలో, నీ కొరకు గడియారాన్ని చూస్తుంటాను.
నీవొక్కసారి ఈ సేవకుడికి వీడ్కోలు చెప్పాక
నీవు లేని చేదు నిజాన్ని నేనిక తలచలేను.

నేను ప్రశ్నించలేను, అసూయ నిండిన ఆలోచనలతో
నీవెక్కడున్నావు, నీవేం చేస్తున్నావని
విషాదం నిండిన బానిసలా, ఏమీ ఆలోచించను
నీవెక్కడున్నా సంతోషంగా ఉండాలని కోరుకుంటాను

ప్రేమికుడు నిజంగా పిచ్చివాడు, నీ ఇష్టప్రకారం
నీవేం చేసినా, అతడు నీ గురించి చెడుగా అనుకోడు.

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

11. నీవు లేవు

(You are absent)

పరిగెడ్తున్న సంవత్సర కాలంలో నీ దగ్గర నేను
లేకపోవడం శిశిరంతో సమానం
ఎంత శీతలాన్ని అనుభవించానో, ఎన్ని చీకటి దినాలో
డిసెంబరు నెల మోడులా ఉన్నదీ యావత్ ప్రపంచం.

వేసవి కాలానికి ఇవ్వవచ్చు మినహాయింపు
ఆకురాలు కాలంతో కలిస్తే గొప్ప పొడిగింపు
యవ్వనపు కోరికల బరువు మోస్తుంది
భర్త చనిపోయాక విధవరాళ్లు దుఃఖపు తలంపు.

ఈ విస్తృత విషయం నాకనిపిస్తుంది
అనాథల ఆశలా, తండ్రిలేని పిల్లల్లా.
ఎండాకాలం, అతడి ఆనందం నీ కొరకే
నీవు లేకపోతే మూగవౌతాయి పక్షులు కూడా!

ఒకవేళ అవి పాడినా, లోపిస్తుంది మాధుర్యం
ఆకులు పాలిపోయి, శిశిరం వస్తుందన్న భయం.

– విలియం షేక్స్పియర్
(William Shakespeare)

12. ఓదార్పు

(A Consolation)

మనుషుల దృష్టిలోనూ అదృష్టంలోనూ అవమానం పాలై,
వెలి వేయబడిన నా స్థితికి దుఃఖిస్తున్నా నొంటరిగా.
ఆగని ఆక్రందనలతో స్వర్గాన్ని అతలాకుతలం చేస్తూ
నావేపు చూసుకుని, నా పరిస్థితిని నిందిస్తున్నా.

ఆశలోని మరో సంపద నాక్కావాలని ఆశిస్తూ
అతడిలా ఉండాలని, స్నేహితులుండాలని, ఇతడి
కళానైపుణ్యం, అతగాడి దృక్పథం కావాలనుకుని
మరిచిపోయాను దేన్నైతే ఎక్కువ ఆనందించేవాడినో.

ఇటువంటి హేయమైన ఆలోచనలలో కూడా
నేను నీ గురించి, తరువాత నా స్థితి గురించి
ఉదయవేళ గానం చేసేవాడిని, లార్క్–భరతపక్షిలా
ఆ వ్యాకులపు నేల నుంచి స్వర్గద్వారాల దగ్గర.

నీ మధుర ప్రేమ అటువంటి సంపదలను తెచ్చింది జ్ఞప్తికి.
ఇప్పుడు నా స్థితిని రాజులతోనైనా, అంగీకరించను, మార్చుకోడానికి.

– విలియం షేక్స్పియర్
(William Shakespeare)

13. మార్పు లేనిది

(The Unchangeable)

ఓహ్, ఎప్పుడూ అనకు నాది బూటకపు హృదయమని
నేను లేకపోవడమనేది నా జ్వాలకపకీర్తి తెచ్చినట్లున్నది.
నా నుంచి నేను వెడలిపోవడం, నీ హృదయంలో
ఉన్న నా ఆత్మ నుంచి విడివడడమంత తేలిక అది.

అది నా ప్రేమ గృహం; బాటసారిలా దూరం
వెళ్లినా, నేను మరల మరలివస్తాను.
కాలంతో సరిగా కాలాన్ని మార్పిడి చేయలేను, కాని,
ఆ మరకను తుడిచివేసే నీటిని తెస్తాను.

ఎప్పుడూ నమ్మకు, నా స్వభావాన్ని పాలించేవి
అన్ని రకాల రక్త బలహీనతలను చుట్టుముట్టేవయినప్పటికీ,
అది ఎంత అసంగతమైన మరక అంటే
నీ మంచితనాన్నంతా వెచ్చించినా అది వదలిపోదు.

ఊరకే నేను ఈ విశాల విశ్వాన్ని పిలవడం లేదు,
అది నిన్ను రక్షిస్తుంది, నా గులాబీ; దానిలో నాకున్నదంతా నీవే!

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

14. నీ సౌందర్యం

(Thy Beauty)

నా దృష్టిలో, ప్రియమిత్రమా, నీకెప్పటికీ రాదు వృద్ధాప్యం
నీ కనులతో నేనెన్నడు కనులు కలిపానో అలాగే నీవుంటావు
నీ అందమలానే ఉంటుంది, మూడు శిశిరాల శీతలం
ఇప్పటికి మూడు వేసవిల గర్వాన్ని తొలగించింది.

మూడు అందమైన జలధారలు, మారాయి ఆకురాలు కాలపు పసుపుకు
నేను ఋతువులలో మార్పును గమనిస్తూనే ఉన్నపుడు
మూడు ఏప్రిల్ సుగంధాలను కాల్చివేసాయి, మూడు జూన్ ఎండలు
నిన్ను తొలిసారి చూసినప్పటి హరితమే తాజాగా ఉంది నీలో!

ఆహా! నీ సౌందర్యం, గడియారపు ముల్లులా
అతడి రూపం నుంచి దొంగిలిస్తుంది, వేగం కనబడదు,
నీ మాధుర్యపు నీడా అంతే, ఇప్పటికీ నిలిచే ఉన్నది
మెదుల్తూనే ఉన్నది, నా కనులను మోసం చేస్తూ!

ఎవరి మీద భయంతోనో, ఆలకించు దీనిని, నీ వయసు మారలేదు
నీవిక్కడ పుట్టగానే, మరణించింది సౌందర్యపు వేసవి, తానిక లేదు.

– విలియం షేక్స్పియర్
(William Shakespeare)

15. డయాఫెనియా

(Diaphenia)

డఫొడిల్, లిల్లీల డయోఫెనియా,
సూర్యుడిలా తెల్లగా, లిల్లీలా అందంగా,
హై హో! నిన్నెంతగా ప్రేమిస్తున్నానో!
నా గొర్రెపిల్లల్ని ప్రేమించినంతగా
వాటి ప్రియ మాతలంత ప్రేమగా;
నీవది ఋజువు చేస్తే నేనదృష్టవంతుడిని నమ్ముతావుగా!

విస్తరిస్తున్న గులాబీల్లా డయాఫెనియా,
అన్ని మాధుర్యాలనూ దాచుకున్న మధుర పదార్థమా,
మధుర హృదయమా, నిన్నెంతగా ప్రేమిస్తున్నానో!
ప్రతి పూవునూ ప్రేమించినంత ప్రేమగా,
అది సూర్యుడి ప్రాణమిచ్చే శక్తిని ప్రేమించినంతగా,
మరణించినవాడిని బ్రతికించే నీ శ్వాస కదిలిస్తుంది నన్ను హాయిగా!

అన్ని ఆశీర్వదించబడిన విషయాల్లా డయాఫెనియా,
అక్కడ నీ గురించిన పొగడ్తలు వెలిబుచ్చబడ్డాయి
ప్రియతమ సంతోషమా, నిన్నెంతగా ప్రేమిస్తున్నానో!
వసంతాన్ని ఇష్టపడే పక్షుల్లా,
తమ ప్రభువును ప్రేమించే తుమ్మెదల్లా,
అందుచేత, ప్రతికి ప్రతిగా, ప్రియకన్యా, ప్రేమించుము నన్ను నన్నుగా!

– హెచ్. కాన్‌స్టేబుల్
(H. Constable)

16. రోజాలిండే

(Rosalynde)

అత్యున్నత మండలంలోని ఖాళీస్థలంలో
ఎక్కడైతే మహా సామ్రాజ్యపు కాంతి ప్రకాశిస్తుందో
ఆమె శిరోజాల వర్ణమంత మనోహరం
విరబోసి ఉన్నా, జడలుగా అల్లి ఉన్నా;
హైహో, అందాల రోజాలిండే, ఓహో!

ఆమె నేత్రాలు మంచులో మెరిసే నీలాలు
ప్రతి చూపులో ప్రతిఫలించు స్వర్గపు అందాలు.
వాటి మెరుపులకు భయపడతారు దేవతలు,
అలా ఆలోచిస్తుంటే వణికిపోతుంది నా వళ్లు.
హైహో, ఆమె నా స్వంతమైతే, ఓహో!

మెరిసే మేఘాలు ఆమె కపోలాలు
అరోరా- అరుణదేవత వదన సౌందర్యాలు
లేదా, వెండి ఎరుపు మేలి ముసుగులు
ఫీబస్-సూర్యుడి చిరునవ్వుల రాజసపు వెలుగులు
హైహో, అందాల రోజాలిండే, ఓహో!

ఆమె అధరాలు మేలి గులాబి మొగ్గలు
ఇరుగు పొరుగు లిల్లీల స్థానపు తగ్గులు
తన చుట్టు పక్కలంతా సుగంధ పరిమళాలు
దేవతల నాకర్షించే శక్తిగల సువాసనలు
హైహో, ఆమె నా స్వంతమైతే, ఓహో!

ఆమె మెడ చూడు అది రాజసపు కోట బురుజు
ప్రేమ స్వయంగా బందీయై పెరిగే చోటు
ఆమె దివ్య, పవిత్ర నేత్రాల నుండి
ప్రసరిస్తాయి దృక్కులు ఘడియ, ఘడియకూ.
హైహో, అందాల రోజాలిండే, ఓహో!

ఆమె పాలిండ్లు ఆనందపు కేంద్రాలు
దివ్య రూప బింబాలా వక్షోజాలు
    ప్రకృతి అక్కడ పొదిగింది హిమకాంతిని
    దానితో సంపూర్ణతను తీర్చిదిద్దింది,
        హైహో, ఆమె నా స్వంతమైతే, ఓహో!

తూర్పు ముత్యాలతో, ఎర్రటి కెంపులతో
తెల్లని చలువరాయి, నీలివర్ణ నీలాలు
    నవరత్న నిర్మితమామె దేహం
    అయినా, స్పర్శకు మెత్తన, చూచేందుకు చక్కన.
    హైహో, అందాల రోజాలిండే, ఓహో!

ప్రకృతే ఆమె రూపాన్ని మెచ్చుకుంటుంది
దేవతలు ఆమెను చూసి గాయపడుతున్నారు
    ప్రేమ అతడి స్వర్గపు అగ్నులను విడిచిపెట్టి
    తన కనులలో అతడి కాంతిని నిలుపుకున్నది.
        హైహో, ఆమె నా స్వంతమైతే, ఓహో!

సంతోషపడకండి, అప్సరసలారా, నేను దుఃఖిస్తున్నాను
చక్కని రోజాలిండే ఇక్కడ లేదని
    అందంలో ఆమె సాటి అందగత్తెలు లేరు
    దివ్య గుణ శీలాల్లో ఆమెను మించలేరు
        హైహో, అందాల రోజాలిండే, ఓహో!
హైహో, నా హృదయమా! దేవుడా, ఆమె నా స్వంతమైతే ఓహో!

– టి. లాడ్జి
(T. Lodge)

17. కాలిన్

(Colin)

జలధార పక్కన స్నానం చేస్తూ కూర్చున్నదొక అందాల యువతి
చక్కటి నీడలామెను మరుగున ఉంచాయక్కడ;
ప్రశాంతంగా వీస్తున్న గాలులు, పక్షుల పాటలు,
ఆమె పక్కనే గలగలా పారుతున్న ఏటి ప్రవాహాలు–
నా కామపు ఆలోచనలు ప్రోత్సహించాయి నా కనులను
నిషేధించిన విషయాలను చూసి రమ్మని.
అయితే, మంచి జ్ఞాపకం, 'ఛీ' అని పెట్టింది చివాట్లు.
అలా నిష్ఫల కోరికకు పడ్డాయి తిట్లు.
హే నోనీ నోనీ హో!
హే నోనీ నోనీ! ఓహో!

గాఢ నిద్రలో పడిపోయాను నేనప్పుడు
ఇష్టమైన ఊహాగానం చూస్తున్నట్లున్నదని
అనిపించింది, కాని, చెప్పలేకపోయింది
ఆమె రూపాన్ని, లేదా, ఆమె వైఖరిని.
కలలుగంటున్న పసిపాపలు చిరునవ్వులు నవ్వుతూ,
ఒక్కోసారి ఏడ్పులోకి జారినట్లుగా–
నేను మేల్కొన్నాను, పెరిగిన జ్ఞానంతో
నేను నిద్రపోయినప్పటి కన్నా–
హే నోనీ నోనీ హో!
హే నోనీ నోనీ! ఓహో!

– ద షెఫర్డ్ టోనీ
(The Shepherd Tony)

18. ఆమెకు ప్రేమతో

(To her with love)

నిన్ను వేసవి దినంతో పోల్చగలనా?
నీవు మరింత అందమూ, నిగ్రహమూ కలదానివి.
మే మాసపు ప్రియమైన పూలమొగ్గలను వణికిస్తాయి ముదురు గాలులు
అంతేకాక వేసవి కాలమెంతో హ్రస్వమైనది కలిసి తిరగడానికి.

ఒక్కోసారి స్వర్గపు నేత్రం మరింత వేడిగా ప్రకాశిస్తుంది.
తరచుగా అతడి స్వర్ణఛాయ మసక బారుతుంది
అందంలోని అందమొక్కోసారి తగ్గిపోతుంది
ప్రకృతి మార్చేదారి, అవకాశం వస్తే, తగ్గకుండా పోతుంది.

కాని, నీ శాశ్వత వేసవి మసకబారదు
నీ సౌందర్యమేమాత్రం నీవు కోల్పోవు
తన నీడలో నీవు తిరిగావని మృత్యువు గొప్పలు చెప్పుకోదు,
కాలపు శాశ్వత దారులలో నీవు పెరుగుతూనే ఉంటావు.

మనుషులు శ్వాసిస్తున్నంత కాలం, కనులు చూస్తున్నంత కాలం
ఈ పాట నిలుస్తుంది, నీకు శాశ్వత జీవితాన్నిస్తుంది.

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

19. అతడి ప్రేయసికి

(To His Love)

వృధా చేయబడిన కాలపు దస్తావేజులలో
అత్యంత సౌందర్యమున్న వ్యక్తుల వర్ణన చూసాను,
చక్కని యతి ప్రాసలున్న కవిత్వం మరింత శోభించడం
మరణించిన స్త్రీల అందాలు, సుందర ప్రభువుల వర్ణనలతోనూ!

ఆ లావణ్యవతి సౌందర్యాన్ని చిత్రించిన ఫలకాలలో,
హస్త, పాద, అధర, నేత్ర, కనుబొమల పొగడ్తలు;
నేను చూసాను పురాతన కలాలు విశేషంగా వర్ణించిన
అందాలు ఇప్పుడు నీలో నిండి ఉన్న అగడ్తలు.

అందుచేత వాళ్ల పొగడ్తలన్నీ జోస్యాలే కదా!
మన కాలం గురించి, నిన్ను నిజంగా ఊహించి,
వాళ్లు దివ్య నేత్రాలతో దర్శించారు, కాని,
నీ గొప్పతనాన్ని పొగిడేంత నైపుణ్యం వాళ్లకు లేదు.

ప్రస్తుత దినాల్ని మనం పరీక్షగా చూస్తున్నాము
కళ్లుండి ఆశ్చర్యపోతున్నాము, కాని పొగడలేకున్నాము.

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

20. ప్రేమ - అసత్య ప్రమాణాలు

(Love's Perjuries)

ఈరోజు, అయ్యో ఏం రోజు, ఈరోజు!
ప్రేమ, దాని నోరు, ఎప్పుడూ 'మే' మాసపు హోరు.
చూసింది అందాల పుష్ప వికాసాన్ని, ఆ పూవు
సరసమైన గాలితో ఆడడాన్ని.
వెల్వెట్ ఆకులగుండా పోతూ కనుగొన్నది
ఎవరికీ కనబడని దారిని ఆ పిల్లతెమ్మెర
అక్కడ ప్రేమికుడు, చచ్చేంత చిక్కిపోయినవాడు
స్వర్గపు ఊపిరి కావాలని కోరుకున్నాడు

గాలి, – అన్నాడతడు, – 'నీ బుగ్గలకు తగలనీ
అలా నన్ను గెలవనీ!'
అయితే, అయ్యో, నా చేయి ప్రతిజ్ఞ చేసింది
నిన్ను నీ ముల్లు నుంచి త్రుంచ కూడదని.
అయ్యో, యువత ప్రతిజ్ఞలు నెరవేరవు
వాళ్లు మాధుర్యాన్ని తెంపి చూస్తారు
నాలో ఆ పాపమున్నదని అనకు
నీ కొరకు నేను ముందే ప్రమాణం చేసాను
ఎవరి కోసమైతే జోవ్ దేవేంద్రుడు
జునోను కోపించాడో, ఆ ఇథియోపి
'జోవ్' కోసం తనను తాను కాదని
నీ ప్రేమకోసం మనిషిగా మారింది సుమా!

– విలియం షేక్స్పియర్
(William Shakespeare)

21. వినతి

(A Supplication)

అప్పుడే మరచిపోవద్దు, నేను నమ్మిన సత్యానికై
వెలిబుచ్చిన అభిప్రాయాన్ని, నా శ్రమతో
కూడిన వేదనను సంతోషంగా భరించినట్లు–
॥ అప్పుడే మరచిపోవద్దు ॥

అప్పుడే మరచిపోవద్దు, నీకు తెలుసును
ఈ అలసిన జీవితం ఎలా మొదలైందో, ఆ పెద్దధ్వని
తరువాత, సేవల గురించి చెప్పుకోరెవ్వరూ–
॥ అప్పుడే మరచిపోవద్దు ॥

అప్పుడే మరచిపోవద్దు, లోహ పరీక్షలను
వంపు తిరిగిన బొటన వేలును, తిరస్కారపు విధానాలను
ఆలస్యం లోని బాధాకర సహనాన్ని–
॥ అప్పుడే మరచిపోవద్దు ॥

మరచిపోవద్దు, ఓహ్, దీనిని మరచి పోవద్దు
ఇదంతా జరిగి ఎన్నాళ్లో అయ్యిందనీ, మనసు
ఎప్పుడూ అనుకోలేదు – ఏదో పొరపాటు జరిగిందని–
॥ అప్పుడే మరచిపోవద్దు ॥

మరచిపోవద్దు నీవే స్వయంగా అంగీకరించావని
అప్పటి నుంచి దీర్ఘకాలంగా నీవు ప్రేమించబడినావని
ఆ అచంచల విశ్వాసంలో ఏమార్పూ లేదని–
॥ అప్పుడే మరచిపోవద్దు ॥

– సర్ టి. వ్యాట్
(Sir T. Wyatt)

22. అరుణ దేవతకు

(To Aurora)

ఓహ్ నీవు ఎటువంటి కీడు చేస్తావో నీకే తెలిస్తే
నీ ఆనందాన్ని ముందే నిర్ణయించుకుని, నా విశ్రాంతినెలా చెడగొడ్తావో;
అప్పుడు నీ ఎదలోని మంచును కరిగించి
అంగీకరించే హృదయాన్ని దయతో వెచ్చబరుస్తావు.

ఓహ్ నీ గర్వం మా ఆనందాల్ని నియంత్రించదులే
ఎటువంటి ప్రేమాద్భుతాల ప్రపంచాన్ని చూస్తున్నావో నీవు!
నాలో మార్పు చెందిన నిన్నొక్కసారి చూస్తే
నీ హృదయంలోకి నా ఆత్మను నింపుతాను నిండుగా;

నా ఆలోచనలన్నీ నీ వదనంలో ప్రకాశిస్తే
ఆ దురవకాశాన్ని చూసి నీవు కేకలు పెట్టొద్దు
నీ దుఃఖాన్ని నీ ఒక్కదానివే మోయవద్దు
నీ కష్టసుఖాల్లో నన్నూ పాలు పంచుకోనివ్వు.

అలా మనం మన దుఃఖాల్ని ఒకటిగా చేద్దాం.
ఈ సంతోషపు కలయికతో వాటిని నిశ్శేషం కావిద్దాం!

– డబ్ల్యు. అలెగ్జాండర్
(W. Alexander)
Earl of Sterline (Sterling)

23. నిజమైన ప్రేమ

(True Love)

యదార్థపు మనస్సుల వివాహానికి నన్ను పిలవొద్దు
అడ్డంకులు వస్తాయి. ప్రేమ ప్రేమ కాదు ఏదైనా
మార్పు కనిపిస్తే మార్పు చెందేట్లయితే, లేదా
తొలగించేవాడితో తొలగించడానికి ముందుకు వంగితే!

ఓహ్ కాదు! ఇది పూర్తిగా అతుక్కున్న ముసుగు
తుఫానులపై కనిపిస్తుంది, ఎంత ఊపినా పడిపోనిది
గమ్యం లేకుండా తిరుగుతున్న నావకు నక్షత్రం లాంటిది
దాని గొప్పతనం తెలుసు, కాని, దాని ప్రయోజనం తెలియదు.

కాలపు మూర్ఖత్వం కాదు ప్రేమ, గులాబీ పెదాలు, బుగ్గలు
అతడి వంగిన కొడవలి దిక్సూచికి దగ్గర్లోనే ఉంటాయి.
ప్రేమ మారదు అతడి స్వల్ప ఘడియలు, వారాల పట్టికలో
అంత్యకాలపు అంచు వరకు, భరిస్తుంది కడవరకు.

ఇది తప్పని ఎవరైనా ఋజువు చేయగలిగితే, ఏ మనిషీ ప్రేమించనట్లే!
నేనూ రాయడం మానేస్తాను ఆ క్షణం నుంచే!

– విలియం షేక్స్పియర్
(William Shakespeare)

24. ఒక సరళగీతం

(A Ditty)

నా యదార్థ ప్రేమికుడి దగ్గరున్నది నాహృదయం, నా దగ్గర అతడిది.
మేమిద్దరం మార్చుకున్నాం ఒకరిదొకరం–
అతడి హృదయాన్ని నేను పట్టుకున్నాను, నాది అతడు
ఇంతకు మించిన గొప్ప బేరం ఇంకేముంటుంది?
నా హృదయం అతడి వద్ద, అతడిది నావద్ద.

నాలో ఉన్న అతడి హృదయం అతడినీ నన్నూ చేస్తుంది ఒకటిగా
అతడిలో ఉన్న నా హృదయం నడుపుతుంది అతడి ఆలోచనలను, ఇంద్రియాలను
అతడు ప్రేమిస్తాడు నా హృదయాన్ని, ఒకప్పుడది అతడిదే గనుక;
నేనిష్టపడతానెందుకంటే అది నాలో దాగి ఉన్నది కదా
నా హృదయం అతడి వద్ద, అతడిది నా వద్ద.

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

25. ప్రేమ సర్వవ్యాపకత్వం

(Love's Omnipresence)

ఈ చిత్తడి నేలలంత దిగువన నేనుంటే
ప్రియతమా, ఆకాశమంత ఎత్తున నీవున్నావు.
అయినా నీ సేవకుడినైన నా ఆలోచనలు
నా ప్రేమను గౌరవించడానికై ఆకాశానికి ఎగుస్తాయి.

ఈ మైదానాలకెగువ ఆకాశమంత ఎత్తున నేనుంటే
ప్రియతమా, నీవు వినయంగా దిగువన ఉన్నావు.
లోతైన అగాథాల్లో అడుగున కనిపిస్తున్నావు.
నీవెక్కడ ఉన్నా సరే నా ప్రేమ చేరుకుంటుంది నిన్ను.

నీవు భూమివైతే, ప్రియతమా, నేను నింగిని.
నా ప్రేమ నీపై సూర్యుడిలా ప్రకాశిస్తుంది.
నిన్ను సహస్ర నేత్రాలతో పరికిస్తుంది, స్వర్గం
గుడ్డిదయ్యేంత వరకూ, ప్రపంచమంతమయ్యేంత వరకూ

నే నెక్కడ ఉన్నా, దిగువనైనా, నీకన్నా పైన ఉన్నా
నీవెక్కడ ఉన్నా సరే, నా హృదయం నిన్నే ప్రేమిస్తుంది నా ప్రాణంగా!

– జె. సిల్వెస్టర్
(J. Sylvester)

26. ఈరోజు నీది

(Carpe diem - Sieze the Day)

ఓ నా ప్రియురాలా, ఎక్కడ తిరుగుతున్నావు?
కాస్త నిలబడి విను, వాస్తవ ప్రేమికుడు వస్తున్నాడు
ఎగువ, దిగువ స్వరాలలో పాడగలిగినవాడు.

మరింత దూరం పోవలదు, అందాల మాధుర్యమా
ప్రేమికుల కలయికతో పూర్తవుతుంది ప్రయాణం
తెలివిగల వాళ్ల సంతతికి తెలుసు నీ సంగతి.

ప్రేమంటే ఏమిటి? ఆ తరువాత దొరకనిది
నేటి ఆనందంలో ఉంటుంది నేడు హాయిగా నవ్వడం.
రేపేమి వస్తుందో తెలియదు ఎవరికీ!

ఆనందమనేది అధికంగా ఆలస్యంలో ఉండదు.
అందుకే రా, ముద్దాడు నన్ను, రెండు పదుల మధురిమా
ఎక్కువ కాల మోర్చుకోదు యవ్వనపు పటిమ!

- విలియం షేక్స్పియర్
(William Shakespeare)

27. శీతాకాలం

(Winter)

మంచు తునకలు గోడకు వేలాడేప్పుడు
గొర్రెలకాపరి 'డిక్' ముక్కు చీదేప్పుడు
టామ్ దుంగలను వసారాలోకి తెస్తున్నపుడు
పాత్రలో పాలు గడ్డకట్టి ఇంటికి వచ్చినప్పుడు
రక్తం ఘనీభవించి, దారులు జారిపోతున్నపుడు
రాత్రిపూట గుడ్లగూబ పాడుతుంది గూఢంగా
టు హూ!
టువిట్! టుహూ! హుషారైన స్వరం! ఊహూ!
ఉలిక్కిపడి జోవన్ పడేసింది, కుండను!
అయ్యో! నూనె కాళ్ల జోవన్ పడేసింది కుండను!
గాలి వీస్తున్నప్పుడు బిగ్గరగా శబ్దాలు
పార్సన్ రంపాన్ని ముంచెత్తిన దగ్గులు
మంచులో కూర్చుని పొదుగుతున్న పక్షులు
మేరియాన్ ముక్కున్నది ఎర్రగా పచ్చిగా
మాడ్చిన పీతలు బుస కొడ్తున్నాయి గిన్నెలో, అప్పుడు
రాత్రిపూట గుడ్లగూబ పాడుతుంది గాఢంగా
టుహూ!
టువిట్! టు హూ! హుషారైన స్వరం! ఊహూ!
ఉలిక్కిపడి జోవన్ పడేసింది కుండను!
అయ్యో నూనె కాళ్ల జోవన్ పడేసింది కుండను!

- విలియం షేక్స్పియర్
(William Shakespeare)

28. ఇది నీవు గ్రహిస్తే

(This thou perceiv'st)

నీవు నన్ను బహుశా ఆ సమయమందు చూసావు
ఎప్పుడైతే పసుపు పత్రాలు, కొద్దిగానో, అసలు లేనప్పుడో
గాలికి వణుకుతున్న శాఖలకు వేలాడుతున్నపుడు
బృందగానాలు శిధిలమై, పక్షులు ఆలస్యంగా పాడుతున్నపుడో

నాలో అప్పుడు నీవు సంధ్యా సమయాన్ని చూసావు
పడమట సూర్యాస్తమయం మసకబారి పోతున్నపుడు
దానిని కొద్దికొద్దిగా చీకటి రాత్రి కొనిపోతున్నపుడు
మృత్యువు రెండోరూపం మనల్ని విశ్రాంతిలో ముంచెత్తినపుడు

నాలో నీవు అటువంటి అగ్ని వెలుగు చూసావు
ఆ భస్మరాశిపై అతడి యవ్వనం పడి ఉన్నపుడు,
మరణశయ్యపైన అది చనిపోవునప్పుడు
దేనితో పోషించబడిందో దానితోనే ఆరగించబడినప్పుడు.

ఇది నీవు గ్రహిస్తే, దృఢ తరమవుతుంది నీ ప్రేమ
అంతగా ప్రేమించాలంటే, నిష్క్రమించాలి ఎన్నడో నీవు.

- విలియం షేక్స్పియర్
(William Shakespeare)

29. స్మృతి

(Remembrance)

మధుర నిశ్శబ్ద ఆలోచనల సమావేశాలలోకి
గత కాలపు జ్ఞాపకాలను ఆహ్వానిస్తున్నాను మనస్ఫూర్తిగా
నేను చూద్దామనుకున్నవెన్నో వాటిలో లేనప్పుడు, నిట్టూర్పులతో,
పాత కష్టాలనే కొత్త అరుపుల్తో నా సమయాన్ని వృధా చేస్తున్నాను.

ప్రవహించడం అలవాటు లేని నేత్రాన్ని ముంచి వేస్తున్నాను
మరణపు తేదీలేని రాత్రిలో దాక్కున్న మిత్రుల కొరకు.
ఎన్నడో రద్దు చేసిన ప్రేమలోని కష్టాలను తిరిగి తోడుతున్నాను
ఎన్నో అదృశ్యమైన దృశ్యాల విలువ తలపోస్తూ మరీమరీ దుఃఖిస్తున్నాను.

అప్పుడు నేను గతించిన బాధలకై మరల బాధపడ్డాను
కష్టాల తరువాత కష్టాలు ఏకరువు పెడ్తాను
ఇంతకు ముందే మూల్గిన మూల్గులను మరల వినిపిస్తాను
ఇంతకు ముందు చెల్లించలేదని కొత్తగా చెల్లిస్తాను.

కాని, నేను నీ గురించే ఆలోచిస్తున్నపుడు, ప్రియతమా,
నష్టాలన్నీ పూడిపోతాయి, దుఃఖాలు అంతమవుతాయి.

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

30. పరిభ్రమణాలు

(Revolutions)

అలలొక్కొక్కటే గులకరాళ్ల తీరానికి చేరుకుంటున్నట్లు
మన నిముషాలు ఒక్కొక్కటే అంతిమానికి త్వరపడతాయి.
ముందు వెళ్లిన దాని స్థానాన్ని తరువాతది తీసుకుంటుంది
వరుస క్రమపు శ్రమలో తృప్తి చెందుతుంది ముందు వెళ్లినది.

జన్మించాక, అది కాంతి వీధిలో అడుగుపెడ్తుంది
అలా నడుస్తూ యవ్వన కిరీటంతో అలంకరించబడ్తుంది.
క్రూరమైన గ్రహణాలు అతడి కీర్తిని అడ్డుకుంటాయి.
కాలమిచ్చిన బహుమతి ఇప్పుడు కలవరపరచబడ్తుంది.

యవ్వనపు సొబగుల్ని కాలం స్థిరపరుస్తుంది.
అందపు కనుబొమలపై సమ ఉజ్జీల్ని నిలబెడ్తుంది.
ప్రకృతి అరుదైన సత్యాల నారగించి పెరుగుతుంది.
కాని ఏదీ నిలబడలేదు అతడి కొడవలి కోత మొదలెట్టినపుడు.

అయినా, రాబోయే కాలాల్లోనూ నిలబడ్తుంది నా కవిత
నీ విలువను కీర్తిస్తూ, అతడి క్రూర హస్తమలానే ఉన్నా!

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

31. వీడ్కోలు

(Fare-well)

వీడ్కోలు! నీవు నా తాహతుకు మించిన విలువైన దానవు
నీ గురించి అంచనాలు నీకు బాగా తెలుసు.
నీ విలువ యొక్క ఒప్పందం విడుదల చేస్తుంది నిన్ను
నీలో ఉన్న నా బంధాలన్నీ పరిమితమైనవే.

నీ అనుమతి లేకుండా నిన్ను నేనెలా ఆపగలను?
అటువంటి సంపదలు పొందేందుకు నా అర్హతలేమిటి?
ఈ చక్కని కానుకకు తగిన అర్హత నాకు లేకున్నది.
అందుచేత, నా హక్కు మరల నా వద్దకే వచ్చి ఉన్నది.

నిన్ను నీవు ఇచ్చుకున్నావు, నీ విలువ నీకు తెలియనప్పుడు
నీవు ఎవరికైతే ఇచ్చావో, ఆ నాకు, పొరపాటున చేరినది.
పొరపాటున చేరిన ఆ గొప్ప కానుక దినదిన ప్రవర్ధమానమవుతున్నది
ఇంటికి రా తిరిగి, తీసుకుందువుగాని సరైన నిర్ణయాన్ని.

కలలు ఉబ్బిస్తున్నాయి నన్ను, నీవు నా స్వంతమయ్యావని;
నిద్రలో నేను రాజును, మెలకువలో ఏమీ కాను.

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

32. ఉద్వేగం లేని జీవితం

(The Life without Passion)

గాయపరచగలిగిన శక్తిగలవాళ్లు ఎవరినీ గాయపరచరు.
బయటకు ప్రదర్శించే దానిని ఆచరణలో పెట్టరు.
తాము గండశిలలా ఉండి ఇతరులను కదిలించేవాళ్లు
నిశ్చలంగా, శీతలంగా ఉండి ఆలస్యంగా ప్రేరేపించబడతారు.

స్వర్గపు కరుణను వారు వంశ పారంపర్యంగా పొందుతారు
ప్రకృతి సంపదలను ఖర్చు కాకుండా కాపాడుతారు.
వాళ్లు వారి వారి వదనాలకు సరైన ప్రభువులు.
మిగతావాళ్లు, పైవాళ్ల అద్వితీయతకు దాసులు.

వేసవి పుష్పాలు చెందుతాయి చక్కని వేసవి కాలానికి
తన కోసమే అది జీవించి, మరణిస్తుంది.
అయితే దానికి కాస్త జబ్బు సోకినప్పుడు
మామూలు పిచ్చిమొక్క దానికన్నా ధైర్యంగా ఉంటుంది.

మధురమైన విషయాలు చేదెక్కుతాయి చెడు పనులతో
లిల్లీపూలు జబ్బుపడితే గడ్డిపూలకన్నా ఎక్కువ కంపుకొడ్తాయి.

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

33. ప్రేమికుడి విన్నపం

(The Lover's Appeal)

మరి, నన్నిలా వదిలేస్తావా నీవు?
లేదను! లేదను! సిగ్గులేదు!
నిన్ను అపనింద నుంచి తప్పించడానికి
నేను భరిస్తున్నా దుఃఖాన్ని, వేదనను,
అయినా, నన్నిలా వదిలేస్తావా నీవు?
లేదను! లేదను!

మరి, నన్నిలా వదిలేస్తే నీవు
నిన్నెంతకాలం నుంచో ప్రేమిస్తున్నవాడిని,
సంపదలలోనూ, కష్టాల మధ్యలోనూ
నీ హృదయమంత కఠినమైనదా,
నన్నిలా వదిలేసి పోవడానికి?
లేదను! లేదను!

మరి, నన్నిలా వదిలేస్తే, నీవు
నా హృదయాన్ని నీకిచ్చినవాడిని,
నిన్నెప్పుడూ విడిచివెళ్లని వాడిని,
బాధలో గాని, అవమానంలోగాని,
ఇప్పుడు, నన్నిలా వదిలేస్తావా, నీవు?
లేదను! లేదను!

మరి, నన్నిలా వదిలేస్తే నీవు
నీలో ఏమాత్రం దయలేకుండా
నిన్నింతగా ప్రేమించినవాడిని
అయ్యో! ఓ క్రూరత్వమా!
మరి, నన్నిలా వదిలేస్తావా నీవు?
లేదను! లేదను!

– సర్ టి. వ్యాట్
(Sir T. Wyatt)

34. నైటింగేల్

(The Nightingale)

అది మంగళకరమైన రోజు
హుషారైన మే నెల రివాజు
ప్రశాంతమైన నీడలో కూర్చుని
మిర్టిల్ చెట్ల తోపులో ఆనాడు

జంతువుల గెంతులు, పక్షుల పాటలు
చెట్లు పెరుగుతున్నాయి, మొక్కలు మొలుస్తున్నాయి.
ప్రతిదీ దుఃఖాల ముల్లులను వెళ్లగొట్టింది
ఒక్క నైటింగేల్ మినహా మిగతావన్నీ.

ఆమె, పాపం, ఒంటరి పక్షి
తన హృదయాన్ని ముల్లు కానించి
పాడిందొక విషాద గీతాన్ని
విన్నవాళ్ల గుండె కరిగేలా!

ఛీ, ఛీ, ఛీఛీ అని చీదిందామె!
ఛీరియొ, ఛీరియొ, బై, బై –అందామె!
ఆమె అలా బాధపడుతుంటే చూడలేను.
కన్నీళ్లు రాకుండా ఆపుకోలేను.

ఆమె దుఃఖాల్ని కళ్లారా చూసిన నేను,
నా దుఃఖాల్ని గుర్తు తెచ్చుకున్నాను.
హే! అనుకున్నాను, నీవు దుఃఖిస్తున్నావు వృథాగా,
ఎవరూ నీ దుఃఖాన్ని చూసి జాలిపడరు,

నీ దుఃఖ బాధను చెట్లు వినలేవు
దయలేని జంతువులు నిన్ను ఆనందపరచలేవు
పాండియన్ ప్రభువు మరణించినాడు
నీ స్నేహితులంతా పేటికలలో ఉన్నారు.

నీ తోటి పక్షులు పాడుతున్నాయి
నీ విషాదాన్నవి పట్టించుకోవు
అయినా, దుఃఖించే పక్షీ! నీకులానే
నన్నూ బతికున్న వాడెవడూ దయతలచబోడు!

- ఆర్. బార్న్‌ఫీల్డ్
(R. Barnfield)

35. నిద్ర

(Sleep)

రక్షణను మాయచేసే నిద్రా, నల్లటి రాత్రి కుమారుడా!
మృత్యువుకు సోదరుడా, చీకటిరాత్రిలో పుట్టినవాడా!
నా ఆందోళనను తొలగించు, వెలుగును పునఃప్రసాదించు.
చీకటితో తిరిగి వస్తుంది నా రక్షణపైని అజాగ్రత్త,

సంతాపం తెలిపేందుకు తగిన సమయాన్నిస్తుంది పగలు,
నా యవ్వనపు వృధా సాహసాలు, పగిలిన ఓడ శకలాలు.
మేలుకునే కళ్లు చాలు, నీ తృణీకారాన్ని చూసి ఏడవడానికి,
నిశీధి అసత్యపు చిత్రహింసలేవీ లేకుండడానికి,

పగటి కోర్కెలు స్వప్న దృశ్యాలుగా రాకుండా ఆపు,
రేపటి ఉద్వేగాలకు ఒక నమూనా చేసి చూపు,
ప్రభాత సూర్యుడు నీ అబద్ధాలను ధృవపరచనీకు,
నా దుఃఖాన్ని మరింత ఎక్కువ చేసే విషాదాన్నివ్వమాకు.

ఇంకా నన్ను నిద్రపోనివ్వు, మేఘాల కౌగిలి వృధానేలే!
పగటిపూట తిరస్కారాన్ని స్పర్శించేందుకు మేలుకోకు.

– యస్. డానియెల్
(S. Daniel)

36. ప్రేమ వీడ్కోలు

(Love's Farewell)

ఇక ఎటువంటి సహాయం లేదు; రా, మనం ముద్దాడి విడిపోదాం
లేదు, నేనిచ్చేసాను, ఇక నీకేమీ నేనివ్వబోను.
నాకు సంతోషమే, హృదయపూర్వక సంతోషమే,
అలా, చాలా చక్కగా స్వేచ్ఛ పొందుతున్నానని.

రా, శాశ్వతంగా కరచాలనం చేయి, నీ ప్రతిజ్ఞలను రద్దుపరచు.
మరల మనమెప్పుడన్నా కలిస్తే,
మన కనుబొమలపై చూడరాదు,
మన పాత ప్రేమ తాలూకు ఏ చిహ్నన్నీ!

ఇది ప్రేమ యొక్క ఆఖరి నిశ్వాసపు ఎగశ్వాస
అతడి నాడి పడిపోతున్నది, ఉద్వేగం మాట్లాడలేకున్నది
మోకరిల్లి ఉన్నది విశ్వాసం, అతడి మరణశయ్య పక్కన-
అమాయకత్వం అతడి కనులను మూస్తున్నది.

ఇప్పుడు, నీవు మాత్రమే, అందరూ ఆశ వదులుకున్నపుడు
మరణం నుంచి జీవనంలోకి మరల తీసుకు రాగలవు.

– యం. డ్రేటన్
(M. Drayton)

37. అతడి వీణకు

(To his lute)

నా ద్వేషం, నీవు వృద్ధి చెందుతున్నపుడెలా ఉందో అలానే ఉన్నది
చెట్ల సమూహపు నీడలో నీ ఆకుపచ్చ మాతృమూర్తిలా
శ్రావ్యంగా ఉండని గాలులు కదులుతున్నపుడు,
పక్షులు తమ స్వరాల్ని నీకు ధారాదత్తం చేసినపుడు!

అప్పటి నుండి నీ గొంతు ఏ ధ్వనులను అంగీకరించింది?
అవి చక్కని శ్రావ్య స్వరాలను ప్రవహించినవి కావు.
నేల నుంచి వెళ్లి గ్రహాలకు సంగీతం నేర్పినవవి,
కష్టాలను తెచ్చే దానివి కాక నీవు ఇంకెవరివి?

మధుర స్వరాలు ఇక ఏమాత్రం మధుర స్వరాలు కావు
స్పృహ కోల్పోతున్న వీనులకవి అనాధల ఆర్తనాదాలు
ప్రతి నాదం ఒక నిట్టూర్పు, ప్రతి ధ్వని ఒక కన్నీటి బొట్టు.
దాని కోసం, ఇంతకు ముందు అడవిలో ఉన్నట్టు ఉండు నిశ్శబ్దంగా!

లేదా, ఏదైనా హస్తం నిన్ను స్పృశించి అంగీకరిస్తే దయతో,
సహచరుడిని కోల్పోయిన తాబేలులా, నీ నష్టాన్ని చేయి ఫిర్యాదు.

– డబ్ల్యు. డ్రమ్మండ్
(W. Drummond)

38. గుడ్డి ప్రేమ

(Blind Love)

ఓహ్ నేను! ఏ నేత్రాలు నా తలలో ప్రేమనుంచాయి?
వాటికి వాస్తవ దృశ్యాలతో సంబంధం లేదు.
ఒకవేళ ఉన్నా, నా న్యాయ నిర్ణయశక్తి ఎటుపోయింది?
సవ్యంగా ఉన్న వాటిలో తప్పులు వెదుకుతుంది.

అదే సరైనదైతే నా అబద్ధపు నేత్రాలు చూసాయా,
అది కాదని ఈ ప్రపంచమెలా అనగలదు?
అది కాకపోతే, ప్రేమ ఖచ్చితంగా గుర్తిస్తుంది
అన్ని కన్నుల వంటిది కాదు ప్రేమ నేత్రమని; లేదు,

ఎలా? ఏ విధంగా ప్రేమ నేత్రం సత్యమైనది?
చూసి చూసి అలసిపోయి కన్నీళ్లతో నిండి ఉన్నది.
ఆశ్చర్యమేమీ లేదు, నేను తప్పుగా చూడడంలో
తనను కప్పిన మబ్బులు తొలగేంత వరకూ సూర్యుడూ చూడలేదు.

ఓ జిత్తులమారి ప్రేమా! కన్నీళ్లతో నన్ను గుడ్డివాడిని చేసావు.
కళ్లు బాగా కనబడితే నీ తప్పులు బయటపడతాయని.

– విలియం షేక్స్పియర్
(William Shakespeare)

39. ఆ గొర్రెలకాపరి అవిశ్వాసురాలు

(The Unfaithful Shepherdess)

తన ఉగ్ర కిరణాలతో సూర్యుడు కాల్చివేస్తున్నాడు
కొండలు, లోయలలోని అన్ని ఫలాలను.
గొర్రెల కాపరి 'ఫిలాన్' మరచిపోయాడు కాలాన్ని,
స్ఫటికపు జలధార దగ్గర కూర్చుని
తన వేణువు మీద పాడుతున్నాడీ పాటను–

వీడ్కోలు ప్రేమా, వీడ్కోలు నీకు అసత్యపు ప్రేమా!
అసత్యపు ప్రేమా, అసత్యపు ప్రేమా నీకు వీడ్కోలు.
నీ మనసెంతో చురుకైనది, కొత్త ప్రేమలో పడిపోయినది.

నేను నీ దృష్టిలో ఉన్నంతకాలమూ
నేను నీ హృదయాన్ని, నీ ఆత్మను, నిధిని
నీ దుఃఖాలూ నిట్టూర్పులూ మరింత అధికమైనా
వేటికీ చల్లారని మంటలలో కాలిపోయినా,
మూన్నాళ్ల ముచ్చటయ్యింది నీ ప్రేమ నాపై
ఇంకో మూడు రోజుల్లో ముగిసింది పూర్తిగా.

వీడ్కోలు ప్రేమా, వీడ్కోలు నీకు అసత్యపు ప్రేమా!
అసత్యపు ప్రేమా, అసత్యపు ప్రేమా నీకు వీడ్కోలు.
నీ మనసెంతో చురుకైనది, కొత్త ప్రేమలో పడిపోయినది.

ఇంకొక గొర్రెలకాపరిని నీవు చూస్తున్నావు.
అతడితో నీ హృదయాన్ని బంధించుకున్నావు.
త్వరగా నీ ప్రేమ ఎగిరిపోయింది నా నుంచి
అతి త్వరగా అతడు ఆక్రమించుకున్నాడు నా స్థానాన్ని.
ఇంతలో మూడవవాడు వచ్చాడు నీ ప్రేమకై
మేము బయటకు, అతడు లోపలకు.

వీడ్కోలు ప్రేమా, వీడ్కోలు నీకు అసత్యపు ప్రేమా!
అసత్యపు ప్రేమా, అసత్యపు ప్రేమా నీకు వీడ్కోలు.
నీ మనసెంతో చురుకైనది, కొత్త ప్రేమలో పడిపోయినది.

నీవు నన్ను సంతోషంగా నిష్క్రమించేట్లు చేసావు
నీ మనసును త్వరగా దారి మళ్లించుకున్నావు
నాకు కాసింత సమయం చిక్కి
నిన్ను నా ప్రియతమురాలిగా ప్రకటించుకునే లోపునే
నీ ప్రేమ అంతా గతమైపోయినది
మొదలవడానికి రెండ్రోజుల ముందే ముగిసిపోయినది.

వీడ్కోలు ప్రేమా, వీడ్కోలు నీకు అసత్యపు ప్రేమా!
అసత్యపు ప్రేమా, అసత్యపు ప్రేమా నీకు వీడ్కోలు.
నీ మనసెంతో చురుకైనది, కొత్త ప్రేమలో పడిపోయినది.

– అనామకుడు
(Anon)

40. సన్యాసం

(A Renunciation)

స్త్రీలు అందంగా ఉండి, ఇష్టంగా లేకున్నా,
లేక, వారి ప్రేమలు స్థిరంగా ఉండి, చంచలం కాకున్నా,
నేను ఆశ్చర్యపోను పురుషులకు సేవాబంధంతో,
వారి మనసు నాకట్టుకోడానికి దీర్ఘకాలం పట్టడాన్ని;
వీళ్లు ఎంత క్షణభంగురర హృదయులో గమనించాక
మగవాళ్లు మైమరచిపోడాన్ని చూసి నవ్వుకుంటాను మనసారా!

వాళ్లు ఎన్నిక చేసేవి, మరుక్షణం మనసు మార్చుకునేవి,
ఫీబస్ సూర్యుడి నుంచి, వనదేవత 'పాన్'కు ఫిరాయించేవి,
ఇంకా తృప్తిలేక, మచ్చిక కాని డేగల్లా, అటూ ఇటూ చూసేవి,
ఈ సున్నితమైన పక్షులు, మనిషి నుంచి మనిషికి మారినట్లు
వాళ్ల పిడికిలిపై కూర్చున్న వాటిని తిరస్కరించి విసిరేయనట్లు,
వాటిని ఎగరనిచ్చినట్లు, అందమైన మూర్ఖులు, ఎటు పోతారో!

అయినా ఒక ఆటగా, మనం వాళ్లకి మచ్చికగా ఉంటాం, పొగుడుతాం
ఇంకే వినోదమూ దొరకనపుడు, కేవలం కాలక్షేపం కోసం.
పలచని రహస్య ప్రమాణాలతో వాళ్లని ఆకర్షిస్తాం.
వాళ్ల జిత్తులతో విసిగినాక, మనకు మనం బయటపడ్తాం.
అప్పుడు మనమంటాం, వాళ్ల భ్రాంతుల్ని ప్రయత్నం చేసి,
ఏం తెలివి తక్కువ ఆటలివి– 'ఓహ్, నేనెంత మూర్ఖుడిని!'–

– ఇ.వెరి – ఆక్స్‌ఫర్డ్ ప్రభువు
(E. Vere - Earl of Oxford)

41. ఆకుపచ్చని పొదరిల్లు

(The Holly)

వీచుమా, వీచుమా శిశిర వాయువీచికా,
నీవేమీ దయలేని దానివి కాదులే.
మనిషి కృతఘ్నుతతో పోల్చి చూసినా;
నీ కోరలంత నిశితమైనవి కావు
ఎందుకంటే నీవు కనిపించవే రూపాన,
కాని, బహు మొరటైనది నీ ఊపిరి చానా!
హే హో! పాడుమా హే హో! ఆకుపచ్చని పొదరింటి వరకు
స్నేహం చాలా వరకు నటన, ప్రేమ కూడా అంతే నయవంచన.
అందుకని, హే హో, హోలీ! ఆకుపచ్చని పొదరిల్లూ,
ఈ జీవితం చాలామట్టుకు ఆనందాల హరివిల్లు.
ఆగిపో, ఆగిపో ఘనీభవించి, చేదు ఆకాశమా!
దగ్గరగా వచ్చి నీవు కొరకవు కాని
మరచిపోబడినాయి నీ ప్రయోజనాలు,
మబ్బులుగా మలుచుకున్నావు అశేష జలాలు
అయినా నీ కాటు మరీ అంత ఘాటు కాదు.
స్నేహితుడు గుర్తుంచుకోని విషయమన్నట్లు.
హే హో, పాడుమా హే హో! ఆకుపచ్చని పొదరింటి వరకు!
స్నేహం చాలా వరకు నటన! ప్రేమ కూడా అంతే నయవంచన!
అందుకని, హే హో హోలీ ఆకుపచ్చని పొదరిల్లూ,
ఈ జీవితం చాలామట్టుకు ఆనందాల హరివిల్లు.

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

42. బృందగీతం-1

(Madrigal)

ఓ తీసుకువెళ్లు, తీసుకువెళ్లిపో ఆ అధరాల్ని
        ముందే మధురంగా ప్రతిజ్ఞలు చేసిన వాటిని.
మరి, ఆ నయనాలు తెల్లవారుజాము వెలుగుల్లా
        తప్పు దారి పట్టించగలవు ఉదయాన్ని.
అయినా, నా ముద్దులు తెస్తాయి, మరల తెస్తాయి
        ప్రేమ ముద్రలు, కాని, సీలు వేయబడి ఉన్నాయి.
                అవి సీలు వేయబడి ఉన్నాయి.

- విలియం షేక్స్పియర్
(William Shakespeare)

43. బృందగీతం-2

(Madrigal)

నా ఆలోచనలు మానవ కష్టాల్ని పట్టుకుంటాయి
నా జీవిత కాలమంతా అసహ్యించుకున్నవాటిని,
ఆర్తనాదాలతో, అరుపులతో,
నా ఆత్మకు శాంతిని తేవడానికి,
ఇక్కడ పరిపాలించే యువరాజును పిలుస్తాను తరచుగా.
        అయితే, అతడు, కర్కశ, నిర్దాక్షిణ్యమైన ప్రభువు.
        దుష్టులను తృణీకరిస్తాడు, ఆశ్చర్యాన్ని కలిగిస్తాడు.
        అతడి సమాధి భవనంపై సౌందర్యపు గులాబి అలంకరించబడగా
        పిచ్చి మొక్కలు పెరగడాన్ని తిరస్కరిస్తాడు, బయటకు రాడు.

- డబ్ల్యు. డ్రమ్మండ్
(W. Drummond)

44. దుఃఖగీతం

(Dirge of Love)

రా, ఇటు రా, మృత్యువా!
విషాదకరపు సైప్రస్ మందసంలో నన్ను పరుండనీ
ఎగిరిపో, ఎగిరిపో ఊపిరీ!
నేనొక దయలేని లావణ్యవతిచే చంపబడ్డాను.
నన్ను కప్పిన తెల్లటి వస్త్రం, నల్లటి 'యూ' చెట్టుకు
        అంటుకున్నది, తయారుచేయి దానిని.
నా మృత్యువు భాగాన్ని, నా అన్న వారెవరూ
        పంచుకోలేదు!

ఒక్క పూవు, ఒక్క అందమైన పూవు
నా నల్లని శవపేటికపై జల్లబడలేదు.
ఒక్క స్నేహితుడు, కనీసం ఒక్క స్నేహితుడు
నా శవాన్ని ఆహ్వానించలేదు, కడకు నా ఎముకలు విసరబడే చోటున
విడవడానికున్నాయి వేలవేల నిట్టూర్పులు
        నన్ను పరుండబెట్టు, ఓహ్, ఎక్కడైతే
విషాదంలో ఉన్న నిజమైన ప్రేమికుడు, నా సమాధిని
        దర్శించి, విలపించడానికున్నాడో అక్కడ.

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

45. కలవాల్సిందే ధూళిలో!

(Come to Dust)

ఎండను గురించి భయపడకు,
భీకర శీతాకాలపు ఆగ్రహాన్ని కూడా!
నీ ప్రపంచ వ్యవహారం ముగిసింది,
ఇంటికి వెళ్లు, నీ జీవితాన్ని తీసుకుని!
బంగరు బాలురు, బాలికలు అందరూ
పొగగొట్టాలూడ్చే వాళ్లలా కలవాల్సిందే ధూళిలో!

గొప్పవాళ్ల అనిష్ఠత గురించి భయపడకు
నియంత వేటును దాటిపోయావు నీవు
తిండికి, వస్త్రాలకు బాధపడబోకు
రెల్లుగడ్డి, ఓక్ వృక్షంతో సమానం నీకు.
రాజదండం, జ్ఞానం, దేహసౌష్ఠవం, అన్నీ
అనుసరించాలి, కలవాల్సిందే ధూళిలో!

నింగిలోని మెరుపు కాంతికి భయపడకు ఇక.
ఉరిమిపడే పిడుగుకూ భీతిచెందకు
నిందకు భయపడకు, వేగాన్ని అదుపులో పెట్టు,
ఆనందాలు, మూల్గులు వీటన్నిటినీ ముగించావు.
యువ ప్రేమికులు, ప్రేమికులందరూ, అన్నీ
అప్పగించాలి, ఆనక కలవాల్సిందే ధూళిలో!

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

46. సముద్రపు విషాదగీతం

(A Sea Dirge)

అయిదడుగుల లోతున నీ తండ్రి ఉన్నాడు
పగడాలతో చేయబడినవాతడి అస్థికలు
మేలిమి ముత్యాలు అతడి నేత్రాలు.
అతడిలోదేదీ కోల్పోదు మెరుపు.
అయినా అతడిలో వస్తుంది మార్పు
వింతగా ఉంటుంది, గొప్పగా రూపు
సముద్ర కన్యలు కొడ్తారు అంతక్రియల గంటలు
హార్క్! అవిగో వినబడ్తున్నాయి, డింగ్, డాంగ్, బెల్లు.

– విలియం షేక్స్‌పియర్ (William Shakespeare)

47. నేల విషాదగీతం

(A Land Dirge)

ఎర్ర రొమ్ము రాబిన్‌ను, రెన్ పిట్టను ఇటు రమ్మను,
చీకటి తోపులలో అవి ఎగుర్తున్నప్పటి నుంచి,
ఆకులు పూలతో కప్పబడ్తున్నాయి,
స్నేహితులు కరవై, ఖననం చేయని శవాలు.

అతడి అంత్యక్రియల అదృష్టం
చీమా, చిట్టెలుక, బొరియలు చేసే చుంచు
గుట్టల్లో పెంచి వెచ్చగా ఉంచు
సమాధులు దోచినా అపాయమేమీ లేదు,
మనుషులకు శత్రువైన, ఆకలి తోడేలు అటు రాబోదు
ఆనక, తన గోళ్లతో అది తవ్వుతుంది వాళ్లనూ, వేచి చూడు!

– జె. వెబ్‌స్టర్ (J. Webster)

48. శవపరీక్ష

(Post Mortem)

నేను సంతృప్తి చెందిన రోజున, నీవు బతికితే,
ఎప్పుడు మృత్యువు నా ఎముకలపై దుమ్ము కప్పుతుందో
ఎప్పుడు అదృష్టం ఇంకోసారి సర్వేక్షణ చేస్తుందో
నీ చనిపోయిన ప్రేమికుడి మొరటు రాతల్లా–

పోల్చిచూడు వీటిని కాలం గడచిన కొద్దీ,
కొత్త కలాలతో అవి అధిగమించబడినా,
నా ప్రేమకొరకై వాటిని దాచివుంచు, వాటి యతి ప్రాసలు,
ఆనందించిన వాళ్ల హాయితో చిన్నబోయినా!

ఓహ్, నాకోసం దాచివుంచు ఈ ప్రేమపూరితమైన ఆలోచన–
'నా స్నేహితుడి లలిత కళాధిదేవత, కాలానుగుణంగా ఎదిగి ఉంటే,
అతడి ప్రేమ తెచ్చిన జన్మకన్నా ఉత్కృష్టమైన బతుకుతో
తన సమకాలీనుల్లో పైకెదగడానికి తోడ్పడేదన్న చింతనతో!'–

అతడు చనిపోయాడు, కవులు తీసుకోవాలి ఋజువు చేసే బాధ్యతను,
వాళ్ల శైలికోసం వాళ్లను, అతడి ప్రేమకోసం అతడిని, చదువుతాను నేను!

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

49. మృత్యు విజయం

(The Triumph of Death)

నేను చనిపోయాక నా గురించి విలపించవలదు.
మోటుగా, చిరాకుగా మోగే గంట చప్పుడును అధిగమించవద్దు.
నేను పారిపోయానని, చేయి హెచ్చరిక, ఈ జగతికి
ఈ నీచ ప్రపంచం నుంచి, ఇంకా నీచమైన పురుగులతో ఉండడానికి.

లేదు, ఈ వాక్యం నీవు చదివితే, గుర్తుంచుకోకు
లిఖించిన హస్తాన్ని, ఎందుకంటే నిన్ను నేను ప్రేమించాను.
నీ గురించిన మధురమైన ఆలోచనలో మరిచిపోయుంటాను
నా గురించి ఆలోచించి ఉంటే నీకు దుఃఖాన్ని తెచ్చేవాడిని.

ఓహ్, నీవు ఈ కవితను చదివేప్పటికి
అప్పటికే నేను మట్టిలో కలిసిపోయి ఉంటే,
నా పేరునంతగా చేయకు పునశ్చరణ
నా జీవితంతో పాటు ప్రేమనూ చేయి శిథిలం నీవు.

నీ ఆక్రందనలోకి ఈ తెలివిగల ప్రపంచం తొంగిచూడనీ,
నేను వెళ్లిపోయాక నాతో కలిపి నిన్నూ వెక్కిరించనీ;

– విలియం షేక్స్పియర్
(William Shakespeare)

50. బృందగానం

(Madrigal)

నీవే చెప్పు ఊహ ఎక్కడ పెంచబడుతుందో
హృదయంలోనా, లేక, శిరస్సులోనా?
        ఎక్కడ పుడ్తుందది, ఎలా పోషించబడ్తుంది?
        జవాబివ్వు, జవాబివ్వు!
కళ్లలో అంతర్ధానమౌతుంది.
        చూపుల్తో పెంచబడ్తుంది.
తాను పుట్టిన ఊయలలోనే చనిపోతుంది.
        మనమందరం మోగిద్దాం ఊహకు అంత్యక్రియల గంటలు
        నేను మొదలెడ్తాను, డింగ్, డాంగ్, బెల్; డింగ్ డాంగ్ బెల్.

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

51. రతీ మన్మధులు

(Cupid and Campaspe)

ముద్దులు పందెమొడ్డి ఆడినారు పేకాట
క్యుపిడ్–మన్మధుడు, కాంపాస్పె–రతీదేవి.
తన తూణీరం, విల్లూ, బాణాలు
తన మాతృమూర్తి పావురాలు, పిచ్చుకల గుంపును
పందెమొడ్డి ఓడినాడు అందగాడు మన్మధుడు.

ఈసారి విసిరినాడు పందెంగా పగడాల అధరాలను
బుగ్గలపై పెరిగిన గులాబీ పుష్పాలను
తన గడ్డంపైనున్న అందమైన చొట్టను.
అన్నిటినీ గెలుచుకుందామె అనాయాసంగాను.

ఆఖరుసారి పందెంగా కాసాడాతడు కళ్లను–
ఆమే గెల్చింది, అయ్యాడు క్యుపిడ్ ఆ రకంగా అంధుడు.
ఓహ్ ప్రేమా! ఆమె నిన్ను కూడా అలానే చేసిందా?
అలా అయితే, అయ్యో, నా సంగతేమవుతుందో కదా!

– జె. లైలీ
(J. Lyly)

52. శుభోదయం

(Good Morning)

మబ్బుల్ని కట్టకట్టి పంపేయి, స్వాగతించు ఉదయాన్ని
రాత్రితో మనం దుఃఖాన్ని పంపుతాము ప్రవాసము.
మధుర వాయువీచికలు మృదువుగా వీచగా, కొండపైని ఒంటరి
భరతపక్షి-లార్క్ పలికెను 'శుభోదయం' నా ప్రియురాలికి!

గాలి ఒసగిన రెక్కలు ఆనందపరచునామె మనసును
భరతపక్షి స్వరాలను తీసుకొందును అప్పుగా నేను.
పక్షి రెక్కలను సవరించుకున్నది, నైటింగేల్ పాడుతున్నది
నా ప్రియురాలికి 'శుభోదయం' పలుకుతున్నది.
నా ప్రియురాలికి శుభోదయం పలుకుటకు
ఆ స్వరాలను తీసుకుంటున్నా అప్పుగా నేను.

నీ గూటి నుంచి నిదురలే, ఎర్ర రొమ్ము రాబిన్
ప్రతి లోయలోని పాటలపిట్టలూ,
ప్రతి గొంతు నుంచి సంగీతం జాలువారనీ,
నా ప్రియురాలికి శుభోదయం పలకనీ.
ప్రతి పొదలోని బ్లాక్ బర్డ్, థ్రష్ పికిలిపిట్టా
స్టేర్, లిన్నెట్, కాక్‌స్పారో
అందమైన చిరుభూతాలూ, మీలో మీరు
నా ప్రియురాలికి పలకండి శుభోదయం!

నా ప్రియురాలికి శుభోదయం స్వాగతం పలకండి!
ప్రతి లోయలోని పాటలపిట్టలూ పాడ రారండి!

– టి. హేవుడ్
(T. Heywood)

53. ఆనంద హృదయం

(The Happy Heart)

నీవు నిరుపేదవైనా బంగరు నిదురలు నీ స్వంతమా?
ఓ మధురమైన సంతృప్తీ!
నీవు కడు భాగ్యవంతుడివైనా మనసు వ్యాకులపడుతున్నదా?
ఓ శిక్షింపబడిన జీవితమా!
నీకు నవ్వు రాదా, మూర్ఖులు అవిశ్రాంతంగా పోగు చేస్తున్నారు
స్వర్ణ సంఖ్యలు, స్వర్ణ సంఖ్యలు.
ఓ మధురమైన సంతృప్తీ! ఓ మధురాతి మధురమైన సంతృప్తీ!
పనిచేయి శీఘ్రంగా, శీఘ్రంగా, శీఘ్రంగా, శీఘ్రంగా;
నిజాయితీతో చేసే పని వదనముంటుంది అందంగా!
అప్పుడు పాడుకో హే నోనీ నోనీ, హే నోనీ నోనీ!

చురుకుగా పారే ఏటి నీళ్లు తాగలేకున్నావా?
ఓ మధురమైన సంతృప్తీ!
సంపదలలో ఈదుతూ, నీ కన్నీళ్లలో నీవే మునుగుతున్నావా?
ఓ శిక్షింపబడిన జీవితమా!
ఎవరైతే సహనంతో కోరికల భారాన్ని మోస్తారో
వారు మోయరు భారాన్ని; అతడే రాజు, మహరాజు!
ఓ మధురమైన సంతృప్తీ! మధురాతి మధురమైన సంతృప్తీ!
పనిచేయి శీఘ్రంగా, శీఘ్రంగా, శీఘ్రంగా, శీఘ్రంగా!
నిజాయితీతో పనిచేసే వదనముంటుంది అందంగా!
అప్పుడు పాడుకో, హే నోనీ నోనీ, హే నోనీ, నోనీ!

– టి. డ్రెక్కర్
(T. Drekkar)

54. జీవితం

(Life)

ఎంతో అందంగా కనిపించే ఈ జీవితం,
గాలిలో పేలిపోయే బుడగతో సమానం
పసిపిల్లల ఊపిరి రూపాన అది
ప్రతిచోటా తరుముతుంటుంది.
అది సంక్రమింపచేసే శీఘ్రవేగాన్ని తట్టుకోవాలి బాగా,
ఒక్కోసారి అదే కనిపిస్తుంది మహాశక్తివంతంగా,

స్వర్ణనేత్రంలా దానినక్కడ బిగించాలి,
ఆ శూన్యపు ఎత్తులపై ఊగిసలాడకుండా,
ఎందుకంటే అదెంతో తేలికైనది,
–కాని, ఆడంబరంలో ఎక్కువ కాలం కనిపించనిది;
ఆలోచనలలో దానిని అమితంగా మెచ్చుకున్నపుడు
అది మామూలుగానే శూన్యం, శూన్యంగా మారుతుంది.

– డబ్లు. డ్రమ్మండ్
(W. Drummond)

55. ఆత్మ - దేహం

(Soul and Body)

అయ్యో ఆత్మా! ఈ పాపపు నేలకు కేంద్రమా!
తిరుగుబాటు శక్తుల గుంపుల్ని చూసి మోసపోయినావా
నీలో నీవెందుకు కుములుతూ, లేమిననుభవిస్తున్నావు?
నీ వెలుపలి గోడలకు మాత్రం ఖరీదైన రంగులు వేస్తున్నావు.

ఎందుకంత వృధా ఖర్చు, అద్దెకుండే ఈ కొద్దికాలానికి?
ఎందుకంత వ్యయం, శిథిలమవుతున్న భవనానికి?
ఈ అమిత వ్యయప్రయాసలను, తినివేస్తాయి పురుగులు
నీ శక్తి తినివేయబడుతుందా? ఇదే నీ దేహాంతమౌతుందా?

ఆత్మా! నీవప్పుడు నీ సేవకుడి నష్టంలో జీవించు.
ఆ సంతాపం నీ వస్తువులను మరింత వృద్ధి చేసేట్లు
లోహపు మడ్డిని అమ్మేప్పుడు పాటించు దివ్య నియమాలు.
నీ లోపలి దానిని పోషించు, బాహ్యాడంబరాలను వర్జించు.

మనుషుల్ని కబళించే మృత్యువును నీవు కబళించు.
ఒకసారి మృత్యువు మరణించాక, మరి ఉండదు మృత్యువు.

– విలియం షేక్స్‌పియర్
(William Shakespeare)

56. జీవితం

(Life)

ఈ ప్రపంచమొక బుద్బుదం; 'జాన' కన్నా స్వల్పం మానవ జీవితం
దుఃఖంతో కూడిన గర్భధారణం; గర్భగుడి నుంచి స్మశానానికి ప్రయాణం.
ఊయల నుంచే శాపగ్రస్తం; జాగ్రత్తలు, భయాలతో పెరగడం
ఎవరప్పుడు క్షణభంగురమైన మృత్యువును విశ్వసిస్తారు?
నీటికి రంగులు వేసి, ధూళిలో వ్రాస్తారు!

దుఃఖంతో ఇక్కడ మనం అణచబడి ఉంటాం.
ఎటువంటి జీవితం గొప్పది?
న్యాయస్థానాలన్నీ పైపై పాఠశాలలు
తెలివితక్కువ వాళ్లను లాలిస్తాయి.
గ్రామీణ ప్రాంతాలు ఇప్పుడు
అనాగరికుల అడ్డాలైనాయి.
ఎక్కడున్నదీనాడు ఏ చెడు అలవాట్లు లేని పట్టణం?
మూడిటిలోనూ ఏది అధమమనే పేరు పెట్టడం!

ఇంటి వ్యవహారాలు భర్త శయ్యను పాడుచేస్తాయి,
లేదా శిరోవేదన కలిగిస్తాయి.
బ్రహ్మచారులు దానిని ఒక శాపమనుకుంటారు,
లేదా అంతకంటే దిక్కుమాలిన పనులు చేస్తారు;
పిల్లల్ని కన్నవాళ్లు, కన్నందుకు ఏడుస్తారు,
లేదా వాళ్లు వెళ్లిపోతే బాగుండుననుకుంటారు.

అందుకని భార్య ఉంటేనేమి? లేకుంటే నేమి?
ఏది కావాలి, ఒక్కడిగా దాస్యమా, ఇద్దరిగా జగడమా?

మన స్వంత ఆప్యాయతలు సంతోషపెట్టడానికే
అయితే అది ఒక రుగ్మత.
సముద్రాన్ని దాటి విదేశాలకు పోవడమనేది
ప్రమాదాలు, శ్రమతో కూడినది.
యుద్ధాలు వాటి శబ్దాలతో మనకు కలిగిస్తాయి భయం.
అవి ఆగినప్పుడు, శాంతి మరింత దుర్భరం.
మరి, ఏం మిగుల్తుందని ఇంకా మనం ఏడ్వాలి
ఇంకా పుట్టనందుకా, లేక, పుట్టి చస్తున్నందుకా?

– లార్డ్ బేకన్
(Lord Bacon)

57. ప్రకృతి పాఠాలు

(The Lessons of Nature)

మనం ప్రపంచమని ఏ పుస్తకాన్ని పిలుస్తున్నామో
దానిలో పొరలు, ఆకుల్ని మనం జాగ్రత్తగా తిప్పాలి.
దానిని సరిదిద్దేవాడు, దానికొక ఆకృతినిచ్చేవాడు
అతడి అరుదైన కళను మనం అభ్యాసన చేయాలి.

విశృంఖల శక్తులను మచ్చిక చేస్తుంది అతడి మహోగ్రశక్తి
అతడు రాసే విధివ్రాత అన్నిదిక్కులా ప్రసరిస్తుంది.
గర్వాంధకారులైన తిరుగుబాటు దారులనతడి న్యాయముపేక్షించదు.
ప్రతి పేజీలోనూ, ఒకే విధమైన ఆవృత్తి ఉండదు.

తెలివి తక్కువ పిల్లల్లా మనం, అమాయకంగా
రంగుల బొమ్మల్ని, స్వర్ణ పత్రాల్ని చూసి మురిసిపోతాం.
చక్కగా వేలాడే అడ్డదిమ్మల్లా, మంచిని వదిలేస్తాం
ఆ మహా రచయిత భావాన్ని సరిగా అర్థం చేసుకోం!

ఏదో అవకాశమొచ్చి మన మనస్సు దేనిపైనైనా లగ్నమైతే
అది బహుశా ఏదో బొమ్మ, అంచుమీద గీసిందయ్యుంటుంది.

– డబ్ల్యు. డ్రమ్మండ్
(W. Drummond)

58. విధి వ్రాత

(Providence)

అన్నీ కదిలే వాటిలానే ఈ ప్రపంచమూ కదుల్తుందా?
ఇదే న్యాయాన్నా ఈ నేలపైన మేము కనుగొనేది?
ఈ స్థిర నిబంధనకేనా నీవూ, మేమూ కట్టుబడి ఉండేది?
ఇవన్నీ పైనున్న నీ శక్తులూ, ప్రభావాలేనా?

దురలవాట్ల పొగమంచుకు గుడ్డివవుతాయి ఆత్మలు
గుడ్డి అదృష్టం, గుడ్డిగా ఉండడాన్ని ఋజువు చేస్తారు స్నేహితులు.
వాళ్లు పాపం, దేవతావిగ్రహం ఆ 'శీలాన్ని' ప్రేమిస్తారు.
తుఫాను గాలిలో అది ఈకలా ఎగిరిపోవడం గమనిస్తారు.

హే! విధి వ్రాత వీటన్నిటినీ ఊపేస్తుంది.
గొప్పగొప్ప మనస్సులే ఎందుకు దుఃఖంతో ఆక్రందిస్తాయి?
ఎందుకు గర్వం వినయాన్ని బానిసగా చూస్తుంది?
అమాయకుల్నే గాయాలెందుకు అణిచివేస్తాయి?

దైవమా? ఈ విధి వ్రాతనాపు; లేదా ప్రసాదించు
మంచివాళ్లకు మంచి కాలాన్ని, చెడ్డవాళ్లకు చెడు సమయాన్ని.

– డబ్ల్యు. డ్రమ్మండ్
(W. Drummond)

59. ప్రపంచపు దారి

(The Worlds Way)

వీటన్నిటితో అలసిపోయాను, మృత్యు విశ్రాంతిని అభిలషిస్తున్నాను.
ఈ ఎడారిని చూచేందుకు బిచ్చగాడిలా పుట్టాను.
ఆనందం కత్తిరించబడినవేవీ నాకక్కరలేదు.
స్వచ్ఛమైన విశ్వాసాన్ని సంతోష రహితంగా విడిచిపెట్టాను.

బంగరు పూత పూసిన గౌరవం, సిగ్గులేకుండా అందలమెక్కింది.
కళంకం లేని శీలంపై, వ్యభిచారిణిగా ముద్ర పడింది.
సరైన పరిపూర్ణత తప్పుగా అవమానించబడింది.
చక్కని దారుఢ్యం కుంటిగా నడిపించబడింది.

అధికారం చేత కళ నోరు నొక్కబడింది.
వైద్యుడిలా బుద్ధిహీనత నైపుణ్యాన్ని అణిచింది.
సాధారణ సత్యం నిమ్నస్థాయికి జారింది
ఖైదు చేయబడిన మంచి, చెడుకు సేవ చేస్తోంది.

వీటన్నిటితో అలసిపోయాను, వీటి వలన నేను వెళ్లిపోతే,
చనిపోవడానికి, దానిని రక్షించు, నేను వదిలి వెళ్తున్నా ప్రేమను ఒంటరిగా!

– విలియం షేక్స్పియర్
(William Shakespeare)

60. సెయింట్ జాన్ బాప్టిస్టు

(Saint John Baptist)

స్వర్గలోకపు ప్రభువుకు ఆఖరి గొప్ప అనుచరుడు
పదును చేయబడని చర్మాన్ని ధరించి, ఎడారి అడవుల్లో నివసించినాడు.
ఆ అడవుల్లో తిరిగే భయంకర క్రూరమృగాలే,
మనుషులకన్నా అపాయ రహితమని భావించినాడతడు.

అక్కడ దొరికే మిడతలే అతడి ఆహారం
తేనె తుట్టెల్లోని స్వచ్ఛమైన తేనె కలిపి ఆరగించడం
ఎండిన శరీరం, లోతైన కళ్లు, ఏదో వింత వ్యవహారం
భూమి నుంచి వెలివేయబడిన వాడిలా అతడి రూపం

అప్పుడతడిలా అరిచాడు– 'ఎవరైతే తమ ఆశలను
దేవుడిపై నమ్ముకున్నారో, నాతోపాటు ఈ ఎడారిలో విలపించండి.
పశ్చాత్తాపపడండి, పశ్చాత్తాపపడండి; పాత దోషాల్ని పరిహరించండి'–
ఎవరు విన్నారా స్వరాన్ని? ఎవరతడికి విధేయులైనారు?

ప్రతిధ్వనులు, అతడు వాటి కాఠిన్యాన్ని సడలించగా, అవి
చెకుముకిరాళ్ల గుహల్లోంచి మార్మోగాయి, పశ్చాత్తాపపడండి!
పశ్చాత్తాపపడండి, పశ్చాత్తాపపడండి!

– డబ్ల్యు. డ్రమ్మండ్
(W. Drummond)

61. ప్రొథలామియాన్ - పెండ్లిపాట

(Prothalamion)

దినం ప్రశాంతంగా ఉన్నది, వణుకుతున్నట్లున్న గాలిలోంచి
జెఫిరస్– పశ్చిమగాలి మధుర వీచికలు మృదువుగా ఆడుతున్నాయి.
ఓ మృదువైన భూతం, కొద్దిగా ఆలస్యం చేసింది
ఉగ్ర టైటాన్ కిరణాలను చేరి అందంగా తళతళా మెరిసింది.
ఎప్పుడైతే నేను (ఎవరి చిరచిరలాడే రక్షణ,
రాజసభలో ఫలించని దీర్ఘకాల నిరీక్షణలోని అసంతృప్తితో
ఆశలన్నీ నిరాశలై, ఖాళీ నీడల్లా నిష్క్రమించి
నా మెదడును రోగగ్రస్తం చేసిందో)
ఆ నా బాధను ఉపశమింప చేసుకోడానికి
వెండిలా మెరిసే థేమ్స్ నదీ ప్రవాహపు ఒడ్డున నడుస్తున్నపుడు
రథ చక్రాల మార్గాల వద్ద నది ధ్వనిస్తున్నప్పుడు
ఆ తీరమంతా వివిధ వర్ణ పుష్ప శోభితమై చిత్రమై,
పచ్చిక మైదానాలు ప్రకాశవంతమైన మణిమయమై,
కన్యల పొదరిళ్లను అలంకరించడానికి అనువై ఉండి
వాళ్లు తమ ప్రియుల శిరస్సులపై పుష్ప కిరీటధారణ చేసే

ఆ నిశ్చితార్థపు రోజు, ఇంకెంతో దూరం లేదు,–
మధుర థేమ్స్ నదీ ప్రవాహమా! మెల్లగా ప్రవహించుమా!
నా ఈ గీతాన్ని ముగించేంతవరకూ–

Sweet Thames run softly till I end my song!

ఆ నది పక్కనే ఉన్న మైదానంలో
జలకన్యల గుంపు నొకదానిని చూసాను నేను.
వాళ్లు అక్కడొచ్చిన వరదకు అందమైన కుమార్తెలు
ఆకుపచ్చని శిరోజాలు ఊగుతున్నాయి ముడివేయక
వారిలో ప్రతి ఒక్కరూ వధువే కనుక
ప్రతి ఒక్కరి వద్ద ఉందొక తీగెల బుట్ట
చిన్నిచిన్ని కొమ్మలతో చిత్రంగా అల్లినది.
రంగురంగుల పూలను దానిలో నింపారు
చక్కని వేళ్లతో చురుకుగా కోసారు
ఎత్తునున్న చిగుళ్లను లాఘవంగా లాగినారు
మైదానంలో పెరిగిన ప్రతి రకమూ కోసినారు
వయొలెట్లు, నీలాలను పోగుచేసి నింపినారు
సాయం సమయంలో ముకుళించే డెయిజీ చేమంతులను
లిల్లీకన్యలను, అడవి గులాబీలను
వెండి పూత వెలిగే నారింజరంగు గులాబీలను
అలంకరించినారు, వరుడి పుష్పగుచ్ఛంపై వ్రాసిన పద్యపాదాలపై,

ఆ నిశ్చితార్థపు రోజు, ఇంకెంతో దూరంలో లేదు,–
మధుర థేమ్స్ నదీ ప్రవాహమా, మెల్లగా ప్రవహించుమా!
నా ఈ గీతాన్ని ముగించేంతవరకూ–

అంత అందమైన పక్షుల జంటను చూడలేదు నేనెపుడూ
డిండస్ శిఖరంపైన మెరిసే మంచు కిరీటం
ఇంత తెల్లగా ఎప్పుడూ కనిపించలేదు.
జోవ్ దేవేంద్రుడు కూడా, హంస రూపాన
'లెడా'ను చేరుకున్నపుడూ ఇంత తెల్లగా లేడు.
(వాళ్లంటారు లెడా కూడా అతడంత తెలుపే అని.
వీళ్లంత తెల్లగా కాదు, కనీసం దరిదాపులకు రాలేరు.)
అంత స్వచ్ఛమైన తెలుపు వీళ్లది.
వారిని భరించిన ఆ నదీ ప్రవాహం కూడా
వారి దేహకాంతుల ముందు కనబడుతున్నది మలినంగా
అందుకే తన అలలను ఉపసంహరించుకున్నదేమో.
వాటి సిల్కు ఈకలను తడపకున్నదేమో,
వాటి మెరుపును నీళ్లు పాడు చేస్తాయనుకున్నది
వాటి అందపు వెలుగును అడ్డుకుంటాయనుకున్నది
అది స్వర్గపు కాంతికి సరిసమానమైనది–

ఆ నిశ్చితార్థపు రోజు ఇంకెంతో దూరంలో లేదు,–
మధుర థేమ్స్ నదీ ప్రవాహమా, మెల్లగా ప్రవహించుమా,
నా ఈ గీతాన్ని ముగించేంత వరకూ–

పూలను నింపుకున్న వెంటనే జలకన్యలు
ఆ వెండి జంటను చూసేందుకు తీసారు పరుగులు
అవి స్ఫటిక వరదలై తేలియాడుతూ వచ్చాయి.
వాటిని చూసి అవాక్కయ్యారు వాళ్లు
వారి కనుల నిండా ఆశ్చర్యపు ఆనవాళ్లు.
అటువంటి సుందర దృశ్యాన్ని వారెన్నడూ చూడలేదేమో,
అంత అందమైన ప్రేమపక్షులు అందరికీ కానరావేమో
స్వర్గంలో పుట్టాయేమో, ఆ సరసమైన జంట
నింగి నుండి దిగి వస్తుందా వీనస్ పరివారమంతా!
ఖచ్చితంగా ఆ జంట నేలపైన పుట్టలేదు
అలా కాదని చెప్పేందుకే ఆధారమూ లేదు.
బహుశా దేవదూతలో, వారి సంతానమో
అవి వేసవి ఎండలో పెరిగాయేమో
ఇంత చక్కటి ఋతువులోనని (వాళ్లంటారు)
ప్రతి పూవూ, గడ్డిమొక్కా నేలపై
తాజాగా చక్కగా అమర్చినట్లున్నపుడు

ఆ నిశ్చితార్థపు రోజు ఇంకెంతో దూరంలో లేదు,–
మధుర థేమ్స్ నదీ ప్రవాహమా, మెల్లగా ప్రవహించుమా,
నేను ఈ గీతాన్ని ముగించేంత వరకూ–

ఆ తరువాత వాళ్లు తీసినారు బుట్టలోని పూలను,
మైదానాలు ప్రసాదించిన అద్భుత అందాలను
మధురమైన పరిమళాలను వెదజల్లు పూలను
వారు జల్లినారు వేడ్కగా ఆ జంటపైన
అలలన్నీ అప్పుడు ఆ ప్రదేశాన్ని కప్పినపుడు
పెన్యూస్ జలాల్లా కనిపించాయీ నాడు
'టెంపె' తీరానికి అవి జాలువారుతూ పోతూ
రంగురంగుల పూల ప్రవాహం ధెస్సాలే దాటినట్లు
కనిపించాయవి లిల్లీపూల సమూహంగా
వధువు గది నేలపై నిండుగా పరచినట్లు–
ఇరువురు జలకన్యలు గుచ్చినారు పూమాలలు
తాజాపూలతో, మధువు నిండిన వాటితో,
అన్నిటిని అందంగా తీర్చిదిద్దినారు
వాటి మంచులాంటి వదనంపై కిరీటంలా ఉంచినారు
వాటిలో ఒకటి పాడింది ఈ పాట
వ్రాసిన గీతము ఆ పగటిపూట.

ఆ నిశ్చితార్థపు రోజు, ఇంకెంతో దూరంలో లేదు,–
మధుర థేమ్స్ నదీ ప్రవాహమా, మెల్లగా ప్రవహించుమా,
నేను ఈ గీతాన్ని ముగించేంత వరకూ–

ఓ ఉత్తమ పక్షులారా! ఈ లోకపు ప్రశస్త ఆభరణాలు మీరు.
స్వర్గానికి కీర్తి, ఈ సంతోషపు ఘడియల వేళ
మిమ్మల్ని మీ అందమైన పొదరింటికి చేర్చు శుభవేళ
ఆనందమొందెదరు గాక, మీ హృదయాల నిండుగా
మీ ప్రేమ దాంపత్య చిహ్నంగా
ప్రేమదేవత అందాల వీనస్,
హృదయాలను కల్లోలపరచే తన కుమారుడితో కలిసి
మీపై నవ్వులు కురిపించెదరు గాక, ఆ నవ్వులు తీసివేస్తాయట
(వాళ్లంటారు) ప్రేమపైని దురభిప్రాయాన్ని, స్నేహపు
తప్పుడు మోసాల్ని పరిహరిస్తాయట ఎప్పటికీ.
మీ హృదయంలో శాశ్వత ప్రశాంతత నెలకొనును గాక!
మీరున్న చోటున అనేకురు మీకు సేవలు చేయుదురుగాక!
మీ శయ్యపై మీరు అనంత భోగాలు అనుభవించెదరు గాక!
మీ కలయికలు ఫలించి వృద్ధి చెందెదరు గాక!
మీ ఆనందానికి ఎల్లలు లేకుండును గాక!

అటువంటి నిశ్చితార్థపు రోజు మరెంత దూరంలో లేదు,-
మధుర థేమ్స్ నదీ ప్రవాహమా, మెల్లగా ప్రహించుమా!
నేను ఈ గీతాన్ని ముగించేంత వరకూ-

అలా ముగించిందా జలకన్య; వంత పాడినారు
మిగతావాళ్లు ద్విగుణీకృత ఉత్సాహాన,
నిశ్చితార్థం ఇంకెంతో దూరంలో లేదని,
పొరుగున ఉన్న ఎఖొ ప్రతిధ్వనించెనప్పుడు
వారి పలుకుబడులు మరల మార్మోగెనప్పుడు.
అలా, ఆ అందాల పక్షులు అటుగా వెళ్లాయి.
గాలి తాకిడి లేకుండా గుసగుసగా పలికెను
అతడు మాట్లాడబోయినా భాష లేదతడికి
తన చేష్టలతో అతడు తెలిపినాడు ప్రేమను
తన ప్రవాహాన్ని నెమ్మదిగా నడిపెను.
అతడిపై నున్నట్టి పక్షులన్నీ అనుకున్నాయప్పుడు–
–'ఈ జంట ఎంత గొప్పది, అన్ని జంటలలో కెల్లా
ఉత్తమమైనది; సింథియా ముందు
మిగతా నక్షత్రాలు వెలవెలబోయినట్లు–
వాళ్లిద్దరూ అన్యోన్యంగా ఆనందిస్తున్నారు
వారికి పరిచర్యలు చేస్తూ జలకన్యలు
వారికి చక్కటి సేవలు అందిస్తున్నారు.

అటువంటి నిశ్చితార్థపు రోజు ఇంకెంతో దూరంలో లేదు,–
మధుర థేమ్స్ నదీ ప్రవాహమా, మెల్లగా ప్రవహించుమా!
నేను ఈ గీతాన్ని ముగించేంత వరకూ–

చివరకు ఆనందంగా చేరినారు లండన్‌కు
ఆనందాల లండన్, దయగల దాయి.
నాకు జీవితపు తొలి నివాసస్థలమామె,
నా పేరులో ఉన్నది వేరొక ఊరైనా,
అది మా పూర్వీకుల ఊరిపేరు.
వాళ్లు వచ్చేప్పటికి అక్కడ ఇటుకల గోపురాలు
థేమ్స్‌నదికవి గతకాలపు జ్ఞాపకాలు
ఇప్పుడక్కడ గొప్పగొప్ప న్యాయవాదులుంటున్నారు
వారి సలహాలను పాటించేవారు టెంప్లర్ ప్రభువులు.
గర్వంతో వాళ్లు నశించేంతవరకూ-
ఆ తరువాత కనిపిస్తున్నదదే రాజభవనం,
అక్కడ నాకప్పుడప్పుడూ లభించేవి మర్యాదా, మన్ననలు
అక్కడ నివసించేవాడు మహాప్రభువు
అతడికి నాలానే స్నేహితులు లేరు.
అయితే, హే! ఇదిక్కడ సరిపోలదు

అటువంటి నిశ్చితార్థపు రోజు, ఇంకెంతో దూరంలో లేదు,-
మధుర థేమ్స్ నదీ ప్రవాహమా, మెల్లగా ప్రవహించుమా!
నేను ఈ గీతాన్ని ముగించేంత వరకూ-

దానిలో నేడు నివసిస్తున్నాడొక ఉన్నత వ్యక్తి
ఇంగ్లాండుకు ఘనకీర్తి, ప్రపంచానికి అద్భుతమూ, స్ఫూర్తి
అతడి పేరు ధ్వనించేది యావత్ స్పెయిన్‌లో ఉరుములా,
దగ్గర దగ్గరగా ఉన్న హెర్క్యులిస్ స్తంభాలు
భయంతో వణికి కంపించేవి, గజగజా!
గౌరవపు అందాల శాఖా, సాహసపు పుష్పమా!
ఇంగ్లండ్‌ను విజయాలు కీర్తితో నింపినవాడా!
నీ ఉన్నతమైన విజయం పంచుతున్నది సంతోషం!
నీ పేరు తలిస్తేనే కలుగుతున్నది ఆనందం!
నీ నైపుణ్యం, శక్తియుక్తులు భుజబలం ద్వారా
నీ దేశం శత్రువుల కీడు నుంచి తప్పించుకొనుగాక!
మహావ్యక్తి ఎలిజా పేరు మార్మోగును గాక!
ప్రపంచమంతటా, నీ హెచ్చరికలు ఆజ్ఞలు నిండగా,
నీ కీర్తి ప్రతిష్ఠలను ఎవరో గాయకకవి
రానున్న తరాలలో గానం చేయును గాక!

ఆ నిశ్చితార్థపు రోజు, ఇంకెంతో దూరంలో లేదు,-
మధుర థేమ్స్ నదీ ప్రవాహమా, మెల్లగా ప్రవహించుమా!
నేను ఈ గీతాన్ని ముగించేంత వరకూ-

ఆ ఎత్తైన బురుజుల నుండి ఈ ఉన్నత ప్రభువు
ప్రకాశవంతమైన హెస్పెర్–శుక్రగ్రహంలా కాంతులీనుతూ
తన స్వర్ణ శిరోజాలు సముద్రపు అలలలో స్నానం చేయగా,
        క్రిందకు దిగివచ్చి వీక్షిస్తున్నాడు నదిని ప్రత్యక్షంగా,
        ఆ గొప్ప పరివారం అటుగా రావడాన్ని
అందులో మంచిగా కనిపిస్తున్నారిద్దరు ప్రభువులు
        అందమైన వదనాలు, చక్కని రూపాలతో
ఏ రాణి గృహానికైనా వన్నెతేగల మహరాజులు
        వాక్చాతుర్యం, శీలసంపదల సహజ సంపన్నులు.
                గొప్ప హోదాకు ఎంతగానో తగినవాళ్లు
జోవ్ కవలల్లా కనులకు కనిపిస్తున్నారు.
కాంతివంతమైన పాలపుంతలో వెలుగుతున్న మిధునరాశిలా
వారిద్దరూ నది పక్కగా నడుస్తున్నారు
ఇద్దరు అందాల వధువులను స్వీకరించి, ప్రేమతో కూడిన ఆనందంతో
        ఆ నిర్ణయించిన సమయానికి
        వారిని తమ వధువులుగా చేసుకున్నారు.

ఆ నిశ్చితార్థపు రోజు, ఇంకెంతో దూరంలో లేదు,–
మధుర థేమ్స్ నదీ ప్రవాహమా, మెల్లగా ప్రవహించుమా!
నేను ఈ గీతాన్ని ముగించేంత వరకూ–

Sweet Thames run softly till I end my song!

– ఎడ్మండ్ స్పెన్సర్
(Edmund Spenser)

Notes

ఎలిజబెత్ యుగం (Elizabethan Age 1558-1625) ను చాలామంది ఆంగ్ల సాహిత్యంలో స్వర్ణయుగంగా భావిస్తారు. **పునరుజ్జీవన యుగం** (Renaissance- 14–16 శతాబ్దాలలో గ్రీకు–రోమన్ కావ్యాల ప్రభావ ఫలితంగా ఏర్పడిన సాహిత్యాది లలిత కళల పునరుద్ధరణ కాలం); **సంస్కరణ యుగం–** (Reformation - 16వ శతాబ్దపు రాజకీయ, మత, సామాజిక వ్యవహారాలలో సంస్కరణలు తెచ్చి, రోమన్ చర్చి వ్యవస్థలోని దురాచారాలను సంస్కరించి, ప్రొటెస్టంట్–Protestant Church వ్యవస్థను స్థాపించిన కాలం); **నూతన ప్రపంచావిష్కరణం–** Explorationof the new world - ఈ మూడిటి ప్రభావం ఎలిజబెతన్ కవులపై పడింది.

ఎలిజబెతన్ యుగంలో ముఖ్యాంశం– భౌతికవాదం (Materialism). Earl of Surray పరిచయం చేసిన Blank Verse తో మొదలైనా, స్పెన్సర్ (The Shepherd's Calender) ఈ యుగానికి ఆద్యుడంటాడు హడ్సన్ మహాశయుడు.

గేయకవిత్వం, పల్లెపట్టు ప్రాంతాల్ని వర్ణించే కవిత్వం, ధ్వన్యాత్మక, వ్యంగ్యాత్మక కవిత్వం (The Faerie queen by Spenser), నాటకాలు (Comedy, Tragedy, Tragicomedy) ఈ కాలంలో అద్భుతాలుగా విరిసాయి. ఈ యుగంలో గొప్పగా ప్రాచుర్యం పొందింది Thomas Wyatt ప్రవేశపెట్టిన సానెట్ ప్రక్రియ (Sonnet).

ఫ్రాన్సిస్కో పెట్రార్క్ (Francesco Petrarch) ఇటలీలో ప్రాచుర్యంలోకి తెచ్చిన పధ్నాలుగు పంక్తులు (8+6), రెండు భాగాలుగా వ్రాయబడే Sonnet ఇప్పుడు Petrarchan Sonnet గా పిలువబడుతున్నది. ఈ ప్రక్రియను ఇటలీ నుంచి Thomas Wyatt ఇంగ్లాండుకు తెచ్చినాడు. ఈ ప్రక్రియ షేక్స్పియర్ చేతిలో అత్యున్నత ప్రమాణాలనందుకున్నది. ఈ ఎలిజబెతన్ సానెట్ మూడు నాలుగు పంక్తుల పద్యాలు (Quatrain); చివరలో ద్విపద (Rhyming Couplet)తో abab cdcd efef gg అంత్యప్రాసతో నడుస్తుంది. చివరి రెండు

పంక్తులు సారాంశాన్నో, నీతి బోధనో చెబుతాయి. (సీసపద్యానికి ఆటవెలదో, తేటగీతో తోడైనట్లు).

ఈ సానెట్లు ప్రేమ, కాలప్రవాహం, అందం, ప్రకృతి వంటి విషయాలను వర్ణిస్తాయి. ఎలిజబెతన్ సానెట్‌కు English Sonnet, Shakespearean Sonnet అనేవి పర్యాయపదాలు.

ఎలిజబెత్ రాణి (1558–1603) కాలంలో ప్రసిద్ధులైన కవులు, రచయితలు, నాటకకర్తలు–

- థామస్ డెక్కర్, జాన్ డొని, జాన్ ఫ్లెచర్
- ఆర్థర్ గోల్డింగ్, రాబర్ట్ గ్రీన్, సర్ జాన్ హారింగ్‌టన్
- బెన్ జాన్సన్, థామస్ కిడ్, జాన్ లైలీ
- క్రిష్టఫర్ మార్లొ, థామస్ మిడిల్‌టన్, థామస్ నాషె
- జార్జి పుటెన్‌హామ్, విలియం షేక్స్‌పియర్, ఫిలిప్ సిడ్నీ
- ఎడ్మండ్ స్పెన్సర్; జాన్ వెబ్‌స్టర్, ఇసబెల్లా విట్నీ.

Elizabethan age was a brief period of Internal peace between the English Reformation and the religious battles between Parliament and the Monarchy.

✤✤✤✤✤

Notes

1. **T. Nash (Thomas Nashe) 1567 - 1601**

: ఎలిజబెతన్ కరపత్ర రచయితలలో ప్రముఖుడు. (Elizebethan Pamphleters) నాటకకర్త, కవి, వ్యంగ్య రచయిత. అతడి ప్రముఖ రచన- The Unfortunate Traveller అనే నవల.

2. **W. Drummund (William Drummond of Hawthronden) (13-12-1585 to 4-12-1649)** : స్కాటిష్ కవి. ఇతడి రచనలలో ప్రధానమైనవి Cypresse grove and the poems. సంగీతం ప్రవహించే పదజాలమితడి సొత్తు. స్వచ్ఛమైన ఉద్వేగాలను ప్రతిఫలించే సానెట్లు వ్రాసిన ఇతడు- The Scottish Petrarch గా పిలువబడినాడు.

3. **William Shakespeare (26-4-1564 to 23-4-1616)**: ఇంగ్లీషు కవి, రచయిత, నటుడు, నాటకకర్త. ఇంగ్లీషు కవులలో అగ్రగణ్యుడు. ప్రపంచపు నాటకకర్తలలో ప్రథముడు. England's National Poet, Bard of Avon అతడికున్న ఇతర బిరుదులు. 38 నాటకాలు, 154 సానెట్లు, రెండు దీర్ఘకవితలు వ్రాసిన జగమెరిగిన కవి, నాటక రచయిత షేక్స్పియర్.



అతడి నాటకాలు ప్రపంచంలోని అన్ని ముఖ్యభాషలలోకి అనువదించ బడినాయి. షేక్స్పియర్ వ్రాసిన 154 సానెట్లులో మొదటి 17- Procreation Sonnets గా, 126 సానెట్లు- Fair Youth ను సంబోధించినవిగా 27 సానెట్లు (127-154)- Dark Lady గురించి వ్రాయబడినవి. సానెట్లలో పేర్కొన్న Rival Poet ఎవరనేది ఇదమిత్థంగా తేలలేదు. Christopher Marlowe, George Chapman ల పేర్లు చర్చించబడినాయి.

కొందరు ఈ సానెట్లను- Pastiche or Parody of 300 Year old Petrarchan Love Sonnets గా పేర్కొన్నారు. స్త్రీ పురుషుల సంబంధాలపై

(20); రాజకీయ సంఘటనలపై (124); ప్రేమను హాస్యం చేస్తూ (128), శృంగార భావనతో (129); అందాన్ని గేలిచేస్తూ (130) – షేక్స్పియర్ 154 సానెట్లను వ్రాసినాడు.

English Sonnets, Shakespearean Sonnets గా ప్రాచుర్యం పొందిన ఈ సానెట్లు ab ab cd cd ef ef gg ప్రాసతో, మూడు quatrains (నాలుగు పాదాలు) ఒక ద్విపద (Couplet) (3 x 4 + 2 = 14) మొత్తం 14 పంక్తులున్న గేయకవితలివి. మూడవ quartain పద్యపు నడకను భావాన్ని మారుస్తుంది. (Volta - Turn) ఆఖరి రెండు పంక్తులు (ద్విపద) నీతినో, సారాంశాన్నో వ్యక్తపరుస్తాయి.

Shall I Compare thee to a summer day,
Thou art more lovely and more temperate.

- Sonnet - 18

Shakespeare's Sonnets తొలిసారిగా 1609లో ప్రచురితమైనాయి. ప్రేమ శృంగారం, ప్రత్యుత్పత్తి, మృత్యువు, కాలం ఇవి ఈ గీతాలలో ప్రధానాంశాలు.

4. **Christopher Marlowe (Kit Marlowe 1564 - 1593)**: నాటక రచయిత, కవి, అనువాదకుడు. ఇతడు The foremost tragedians of his day గా పేరు పొందినాడు. విలియం షేక్స్పియర్‌ను ప్రభావితం చేసిన కవి. Blank Verse (regular metrical but irregular rhymes)కు ఆద్యుడు. Dido, Tamburlane, The Jew of Malta, Doctor Faustus, Edward II, The Massacre at Paris ఇతడి ప్రసిద్ధ నాటకాలు. Hero and Leander, The Passionate Shepherd to his love లాంటివి ప్రాచుర్యంలో ఉన్న కవితలు. ట్రాజెడీ రచయిత మార్లో Ingram Frizer అనే అతడి చేతిలో కత్తిపోట్లకు గురై మరణించడం అదొక ట్రాజెడీ.



Doctor = Faustus నాటకంలోని ఈ వాక్యం– Helen of Troy గురించి–

Was this the face that launched a thousand ships and burnt the topless tower of Ilium?

– అనే వాక్యం మనల్ని ఎప్పటికీ వెంటాడుతూనే ఉంటుంది.

5. H. Constable (Henry Constable 1562 - 1613) : కవి. ఇతడు తన– 'Diana' - ఇంగ్లీషు తొలి సానెట్ వరుస రచనలతో ప్రసిద్ధికెక్కినాడు. కాథలిక్‌గా మారడం వలన రాజాగ్రహానికి గురై జైలుపాలైనాడు. ప్రవాసంలో Liege వద్ద 1613లో మరణించినాడు.

6. T. Lodge (Thomas Lodge 1558-1625) : ఇంగ్లీషు వైద్యుడు, రచయిత. ఎలిజబెతన్, జాకొబియన్ కాలంలో నాటకాలు, వచనం వ్రాసినాడు. Scillaes Meta morphosis (1589), Rosalynde (1590) కవితలు విలియం షేక్స్పియర్ – Venus and Adonis (1593), As you like it (1603)కు ప్రేరణలు.

7. The Shepherd Tony (Anthony Munday 1553-1633) : ఎలిజబెతన్ కవులలో ఒకడు. అతడి ప్రసిద్ధ రచన 'Beauty Bathing' ఈ పాట England's Helicon లో (1600) ప్రచురింపబడింది.

8. Sir T. Wyatt (Thomas Wyatt 1503-1542) : 16వ శతాబ్దపు ఇంగ్లాండ్ రాయబారి, కవి. ఆంగ్ల సాహిత్యంలోకి సానెట్‌ను ప్రవేశపెట్టిన వాడిగా పేరు తెచ్చుకున్నాడు. (ఇటాలియన్ Petrarch Sonnet - 14 పంక్తులు abba abba, ప్రాస. తొమ్మిదవ పంక్తి నుంచి Volta-turn, అర్థంలో శైలిలో) వ్యాట్– ఇంగ్లీషు సానెట్లలో cddc ee ని కూడా వాడి ప్రత్యేకతను తెచ్చినాడు. ఎనిమిదవ హెన్రీ ప్రభువు వివాహమాడిన Anne Boleyn ఇతడి చిన్ననాటి ప్రేమికురాలని విమర్శకుల అభిప్రాయం.

9. W. Alexander (William Alexander 1567-1640) Ist Earl of Stirling : స్కాటిష్ సభికుడు, కవి. ఇతడి రచనలలో ముఖ్యమైనవి Aurora (1604), The Monarchick Tragedies

(1604), Dooms-Day (1614) స్కాటిష్ వలసల స్థాపనలో (Long Island-New York) ప్రముఖ పాత్ర వహించినాడు.

10. Sir P. Sydney (Philip Sydney 1554-1586) : ఇంగ్లీషు కవి, సభికుడు, పండితుడు, సైనికుడు. ఎలిజబెతన్ యుగంలో ప్రముఖుడు. Astrophel and Stella, The Defense of Petry, The Countess of Pembroke's Arcadia ఇతడి రచనలలో ప్రముఖమైనవి. చనిపోబోతూ కూడా తన పక్కనే గాయాలతో ఉన్న సైనికుడికి నీరు తాగమని ఇచ్చి- Thy necessity is yet greater than mine' - అన్న మహానుభావుడు. యుద్ధంలో తగిలిన గాయాలకు కాలు కుళ్లిపోగా (Gangrene) మరణశయ్యపై ఉండి తాను చనిపోయాక పాడేందుకు ఓ గీతం వ్రాసినాడని అంటారు. 31 ఏళ్ల వయసులో యుద్ధంలో తుపాకి దెబ్బ తగలగా 26 రోజుల తరువాత మరణించినాడు.

11. Joshua Sylvester (1563-1618) : అతడి కవిత Love's omnipresence ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది. ఎలిజబెతన్ కాలానికి చెందిన సిల్వెస్టర్ కవి అనువాదకుడు.

12. R. Barnfield (Richard Barnifield 1574-1620) : ఇంగ్లీషు కవి. షేక్స్పియర్ పేర్కొన్న 'Rival Poet'. ఇతడేనేమోనని కొందరి అభిప్రాయం. The Affectionate Shepherd, The Possionate Pilgrim ఇతడి పేరెన్నికగన్న రచనలు. 1599లో ప్రచురింపబడిన The Passionate Pilgrim by W. Shakespeare అని ఉన్నా Barnfield తానే దానిని వ్రాసినట్లు నిర్ధారించినాడు. Lady Pecunia, The Complaint of Poetry ఇతడి రచనలు.



13. S. Daniel (Samuel Daniel 1562-1619) : ఇంగ్లీషు కవి, చరిత్రకారుడు. Hymen's triumph, The complaint of Rosamond, ఇంకా అనేక సానెట్లు అతడి శైలిలోని సమతుల్యతను చాటిచెప్తాయి. ఆనె (Anne) రాణికి- groom of the chamber గా

gentleman - extra ordinary గా నియమించ బడినాడు. చరమాంకంలో అన్ని పదవులనూ వదులుకుని వ్యవసాయక్షేత్రంలో The Ridge (Rudge) లో స్థిరపడినాడు.

14. M. Drayton (Michael Drayton 1563-1631) : ఆంగ్ల కవి.

The Harmony of the Church ఇతడి తొలి పుస్తకం. The Shepherd's Garland - 64 సానెట్ల రచన. తన ప్రియురాలికై వ్రాసినది. ప్రేమ విఫలం కావడంతో బ్రహ్మచారిగానే మరణిచాడంటారు. గేయ కవిత్వానికి (Lyrical Poem)కు 'Ode' అని పేరిడింది ఇతడే అంటారు. Short, Staccate Anacreontics (గ్రీకు కవి Anacreon శైలి – ప్రేమ, మధువుల వర్ణన) ఏడు సంయుక్తాక్షరాలు. (బిజీ, క్యూర్యస్, థర్ట్సీ ఫ్లై – Busy Curious, Thirsty fly, Drink with me, and drink as I). The legend of Piers Gaveston, Matilda (1594) Mortimeriados (1596) ఇతడి ప్రసిద్ధ రచనలు. ఎలిజబెత్ ఆస్థానంలో గౌరవాన్ని పొందినా, మొదటి జేమ్స్ అతడిని ఆదరించలేదు. బ్రిటన్‌లోని అన్ని ముఖ్య స్థలాలను కవిత్వీకరించి వాటికి శాశ్వతత్వాన్నిచ్చినాడు. The ballad of Agincourt పేరొందిన వీరగాథ (Ballad).

15. Edward de Verse - 17th Earl of Oxford (1550-1604) : ఇతడు

వ్రాసిన కవితలు, నాటకాలకు Shakespeare పేరు పెట్టాడనేది Oxfordian Theory (1920) అయితే de verse 1604 లో మరణించినాడు. (షేక్స్పియర్ 1564–1616). ఎలిజబెతన్ సభికుల్లో ప్రేమ కవిత్వాన్ని వ్రాసిన మొదటి కవి. విలాసాలకు మొత్తం తన ఎస్టేట్‌ను వ్యయపరచినవాడితడు. Oxford men, Oxford boys పేర్లతో నటులను, కవులను చేరదీసి కళాపోషకుడని కీర్తి గడించినా, ఆక్స్‌ఫర్డ్ ఎస్టేట్‌ను మొత్తం అమ్మేసిన ఘనత దక్కింది.

16. J. Webster (John Webster 1580-1634) : ఇంగ్లీషు జాకొబియన్ నాటకకర్త.

అతడి దుఃఖాంత నాటకాలు (Tragedies) The White Devil, The Duchess of Malfi 17వ శతాబ్దంలో Master Pieces గా పేరుపొందాయి. అతడి రచనలు, జీవితం, విలియం షేక్స్పియర్‌కు సమకాలీనంగా గడిచాయి.

17. J. Lyly (John Lyly 1554-1606) : ఆంగ్ల కవి, రచయిత, నాటకకర్త, రాజకీయవేత్త. అతడి రచనలలో ప్రముఖమైనవి Euphues : The Anatomy of Wit (1578), Euphues and England (1580). అతడి శైలి Euphuism గా పేరు తెచ్చుకున్నది. 'All is fair in love and war' ఈ ప్రసిద్ధ వాక్యం Lyly's Euphues కు అన్వయింపబడినది. Love's Metamorphosis, The Woman in the Moon ఆరు సుఖాంత నాటికలు ఇతడి ఇతర రచనలు. విలియం షేక్స్‌పియర్ ఈ రచనల ప్రభావంతో Love's Labour Lost (Love's Metamorphosis); A Mid Summer Night's Dream (Gallathea) వ్రాసాడని విజ్ఞుల అభిప్రాయం.



18. T. Heywood (Thomas Heywood 1570-1641) : కవి, నాటక రచయిత, నటుడు, రచయిత. ఎలిజబెతన్, జాకొబియన్ కాలంలో ప్రసిద్ధికెక్కినాడు. Prose Shakespeare గా, a model of a light and rare talent గా పేరు గాంచినాడు. A Women Killed with Kindness ఇతడి ప్రసిద్ధ రచన.

19. T. Dekker (Thomas Dekker 1572-1632) : ఆంగ్ల నాటక ప్రయోక్త. కరపత్ర రచయిత. అనేక రచనలు చేసినాడు. The Shoe maker's Holiday (The gentle craft) ఇతడి పేరెన్నికగన్న రచన. వచన, పద్య కవితలు, పాంప్లెట్లు వ్రాయడంలో ఎంతో కీర్తి గడించినాడు. Cradle Song -` 'Golden Slumbers Kiss Your Eyes' కవితను Beatles ప్రేరణగా తీసుకుని Golden Slumbers అనే పాట వ్రాసుకున్నారంటారు.

20. Lord Bacon (Francis Bacon, Ist Viscount St. Alban) (1561-1626) : వేదాంతి, రాజకీయవేత్త, సైంటిస్ట్, జ్యూరిస్ట్, వక్త, వ్యాస రచయిత, కవి, రచయిత. Attorney General గా, Lord Chancellor of England గా పని చేసినాడు. Father of Empericism (అనుభవ వాదం)గా,

పరిశీలన-ప్రయోగం ముఖ్యమనేది ఇతడి సిద్ధాంతం Baconian Method). Father of Scientific Method గా పేరు గాంచినాడు.

ఇతడి జీవితకాలపు శత్రువు Edward Coke. ఇతడు వివాహమాడదామనుకున్న Elizabeth Hatton పెళ్లి చేసుకోవడం, కలిసిరాని కాలంలో శత్రువు ఇతడిని పార్లమెంటులో దోషిగా నిలబెట్టి, నేరాన్ని ఋజువు చేయడం, నలభై అయిదేళ్ల వయసులో పధ్నాలుగేళ్ల బాలికను (Alice Barnham) వివాహమాడడం, Pederast గా (చిన్న పిల్లల ప్రేమికుడు), స్వలింగ సంపర్కుడిగా నిందలు పడడం ఇతడి జీవితంలో కొన్ని విచిత్రాలు.

21. Edmund Spenser (1552-1599) : ఆంగ్ల కవి. The Faery Queen ఓ అద్భుత వ్యంగ్యాత్మక కావ్యం. One of the Greatest Poets in English Language. భాషాశిల్పి. The Shepherd's Calender, Complaints, Amoretti and Epithalamion (1595) Prothalamion ఇతర ముఖ్య రచనలు.



తాను ప్రేమించి పెండ్లాడిన Elizabeth Boyle కు సమర్పించిన కవితా కానుకలివి. Amoretti and Epithalamion లో మొత్తం 89 సానెట్లున్నాయి. తన ప్రియురాలికై విరహవేదన Amoretti లో ప్రధానాంశం. Epithalamion లో 365 దీర్ఘ పంక్తులు (దినాలు); 68 చిన్ని పంక్తులు (52 వారాలు + 12 నెలలు + 4 ఋతువులు) 24 పద్యాలు (Stangza నాలుగు పాదాల పద్యం) - (24 గంటలు) - కాలాన్ని సూచిస్తాయి.

prothalamion పెండ్లి పాట - ఓ ప్రభువు ప్రాపకం కొరకు అతడి కుమార్తెలపై వ్రాసిన కవిత.

Spenserian Stanzas ab abb cd ccdc dee ప్రాసతో విలక్షణంగా ఉంటాయి. పై పద్యంలో ఆఖరి పంక్తి, దిగువ పద్యంలోని మొదటి పంక్తితో అనుసంధానం చేయబడి ఉంటుంది.

Epithalamium - an ode honoring a bride and bridegroom.

Prothalamium - a nuptial or wedding song or verse.

Dr. LANKA SIVA RAMA PRASAD

M.B.B.S; M.S (General Surgery);
M.Ch (Cardio Thoracic & Vascular Surgery)
FIVS (Fellow in Vascular Surgery)
Post Graduate Diplomate in Human Rights
Post Graduate Diplomate in Television Production
Web Engineer- Web Designer
Fellow of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Cell Animation Artist (Heart Animation Acadamy - Hyderabad)
Computer Animation Specialist (Pentafour- Chennai)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

డాక్టర్ లంకా శివరామప్రసాద్ రచనలు

కవిత్వం (తెలుగు) (Poetry) :

1. ఆల్కెమీ
2. వానమబ్బుల కాంతిఖడ్గం
3. టీకప్పులో తుఫాను
4. తంగేటి జున్ను
5. కర్కాటకం (క్యాన్సరు) (First Poetry Book about Cancer in Telugu)
6. ఒక సరస్సు-అనేక హంసలు (First Poetry Book about Psychiatry in Telugu)
7. మరణ శాసనం - దీర్ఘ కవిత.
8. శ్రీ లలితాసహస్రనామ స్తోత్రం

కవిత్వం (ఇంగ్లీషు) (Poetry) :

1. **Shades**
2. **The Twilight Zone**

నవలలు (Novels) :

1. **In Search of Truth (English)**
2. సత్యాన్వేషణలో (తెలుగు)
3. జీనోమ్ (తెలుగు) (First Biotechnology Novel in Telugu)

కథలు, వ్యాసాలు (Stories, Essays) :

1. కత్తి అంచుపై... (First Noir Stories in Telugu)
2. ఛుప్ కె ఛుప్ కె (రహస్యభాష) (స్త్రీల వ్యాధులు)
3. అక్షరార్చన

ఇతరాలు (Others) :

1. దీప నిర్వాణగంధం (About Death)
2. స్వప్నశాస్త్రం (Dreams-1)
3. **కలలు–పీడకలలు** (Dreams-2)
4. సంఖ్యాశాస్త్రం (Numerology)
5. **How to be Happy**
6. డా. జయదేవ్ కార్టూన్లు
7. **Bouquet of Telugu Songs and Poems**

అనువాదాలు **(English to Telugu) Translations :**

1. ఇలియాడ్ (Homer) - **Iliad**
2. ఒడెస్సీ (Homer) - **Odyssey**
3. ఎపిక్ సైకిల్ (Homer) - **Epic Cycle**
4. మూడు గ్రీకు ట్రాజెడీలు - **Three Greek Tragedies**
5. ఈనీడ్ (Virgil) - **Aenied**
6. తీర్థయాత్రికుని ప్రగతి (John Bunyan) - **Pilgrims Progress**
7. పారడైజ్ లాస్ట్ & రిగైన్డ్ (John Milton) - **Paradise Lost & Paradise Regained**
8. డివైన్ కామెడీ (Dante) - **Divine Comedy**
9. ఫాస్ట్ (Goethe) - **Faust**
10. నామదేవొ ధసాల్ కవిత్వం (NamDeo Dhasal) Poetry
11. ప్రపంచ ప్రసిద్ధ కథలు (World Famous Stories)
12. విలియం బ్లేక్ కవిత్వం (William Blake Poetry)
13. రసధుని (Russian Poetry)
14. **జలపాతం (అష్టాదశ ఆంగ్ల కవుల కవిత్వం)** (18 English Poets)
15. క్రీస్తు అద్భుతగీతాలు (The Wonderful Poems on Christ)
16. క్రీస్తు నడచిన దారి (The Path of Christ)
17. **మస్నవి 1 – 6** (మౌలానా జలాలుద్దీన్ రూమి) - **Masnavi**
18. **పక్షుల సభ (ఫరీదుద్దీన్ అత్తర్) - Conference of Birds**
19. శిలప్పదికారం (తమిళ సాహిత్యం) - **Silappadikaram**
20. మణిమేఖల (తమిళ సాహిత్యం) - **Manimekhala**
21. తమిళ సరస్వతి అందెల రవళి (తమిళ సాహిత్యం) - **Sangam Poetry**
22. డబ్బు–మని–షి - **Money Poetry**
23. శాంతి యుద్ధం - **War-Peace Poetry**

24. ఎమిలి డికెన్‌సన్ కవిత్వం 1-5 (తెలుగులో)
25. సౌగంధిక (కవిత్వం)
26. తూర్పు-పడమర (కవిత్వం) (Master Poems in English)
27. ప్రేమ కురిసిన వేళలో... (కవిత్వం) (Master Poems in English)
28. వాళ్లు ముగ్గురు (కవిత్వం) (Master Poems in English)
29. అలనాటి కొత్తగాలి (కవిత్వం) (Master Poems in English)
30. మంచు తుఫాను (కవిత్వం) (Master Poems in English)

అనువాదాలు (తెలుగు మరియు ఇతర భాషల్నుంచి ఇంగ్లీషులోకి) **Translations :**

1. **Modern Bhagavad Geeta** (Poetry) (Vyasa)
2. **Soundarya Lahari** (Poetry) (Sankaracharya)
3. **Bhagavatam** (Poetry) (Potana)
4. **Samparayam** (Poetry) (Suprasanna)
5. **The Tree of Fire** (Poetry) (Anumandla Bhoomaiah)
6. **The Pool of Blood** (Novel) (Ampasayya Naveen)
7. **The Poems of Kuppam** (Poetry) (Seeta Ram)
8. **The Broken Grammar** (Poetry) (T.W. Sudhakar)
9. **We need a language** (Poetry) (T.W. Sudhakar)
10. **This is No Streaking** (Stories) (K.K. Menon)
11. **The Voice of Telangana** (Poetry) (Madiraju Ranga Rao)
12. **Satarupa** (Poetry) (A.K. Khanna)
13. **Fire & Ice** (Poetry) (Rama Chandramouli)
14. **హిందీ నుంచి తెలుగులోకి - మధుశాల (హరివంశరాయ్ బచ్చన్)**

శతకాలు (Poetry) :

1. **కుయ్యోమొర్రో శతకం**
2. **భైరవ శతకం**
3. **కాయగూర శతకం**
4. **అయ్యబాబోయ్ శతకం**

త్వరలో (Poetry) :

1. **దైవమార్గం (మహమ్మదీయ మతం)** (Poetry)
2. **సెలయేరు** (Master Poems - English to Telugu)
3. ఎండా-వానా (కవిత్వం) (Master Poems in English)

4. **పిల్లనగ్రోవి పిలుపు** (కవిత్వం) (Master Poems in English)
5. **నాలుగు దిక్కులు** (కవిత్వం) (Master Poems in English)
6. **అల్లంత దూరాన ఆ పాట వినవచ్చె** (కవిత్వం) (Master Poems in English)
7. **దివ్య వస్త్రాల కోసం** (కవిత్వం) (Master Poems in English)
8. **ఆమని** (కవిత్వం) (Master Poems in English)
9. **ఒక మధుశాల** (కవిత్వం) (Master Poems in English)
10. **కొత్త దీపాలు** (కవిత్వం) (Master Poems in English)
11. **మరుభూమి** (కవిత్వం) (Master Poems in English)
12. Odysseus Elytis '**The Axion Esti**' **Worthy it is - ఇది విలువైనది.**
13. Frederico Garfcia Lorca "**Love & Death**" - ప్రేమ **– మృత్యువు**
14. పదివేల పంక్తులు (ప్రపంచశాంతి కోసం) ఎడ్విన్ కార్డివిల్లా **(Part-I)**
15. Bees Need No Invitation When Flowers Bloom...
16. **పాబ్లో నెరుడా కవిత్వం-1**

ప్రపంచ సాహిత్యం-40

పిల్లనగ్రోవి పిలుపు

THE CALL OF FLUTE

"పిల్లనగ్రోవి పిలుపు"గా వెలువడుతున్న ఈ కవితా సంకలనంలో
ప్రతి కవితా దానికదే సాటి.
ప్రేమలోని మాధుర్యాన్ని, విషాద, విరహాల్ని, దైవప్రేమను,
మృత్యువును, నిద్రను, ఇతర భావనలను తెలిపే ఈ అద్భుత కవితలు
ఆయా కవుల శైలిని, పద విన్యాసాల్ని, సంగీతపు హోయల్లను
పాఠకుల కనులముందుంచి, మనసును ఆకట్టుకుని చెరగని ముద్ర వేస్తాయి.
సృజనలోకం ప్రచురించిన అనేక అనువాద కవితా సంకలనాల్ని
విశేషంగా ఆదరించిన తెలుగు సాహితీలోకం ఈ పుస్తకాన్ని కూడా
అక్కున చేర్చుకుంటుందని మనసారా ఆశిస్తున్నాం.

డాక్టర్ లంకా శివరామప్రసాద్